నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
మంగళవారం | ఏప్రిల్ 16, 2024 | www.navatelangana.com

గ్రామాల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలి

నవతెలంగాణ-జన్నారం

గ్రామాల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని ఎంపీడీవో శశికళ అన్నారు. సోమవారం మండలంలోని చింతగూడ గ్రామంలో చెడిపోయిన చేతి పంపును రిపేరు చేయించారు. అనంతరం గ్రామంలో ఉన్న వాటర్ ట్యాంక్‌ను శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవి దృష్ట్యా నీటి ఎద్దడి తలెత్తకుండా ప్రజలకు మంచినీరు అందించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజలు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డి రమేష్, కార్యదర్శి ఉన్నారు.



అగ్నిమాపక వారోత్సవాల వాల్‌పోస్టర్లు విడుదల

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అగ్ని ప్రమాదాల నివారణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ రాజార్షి షా పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అగ్నిమాపక వారోత్సవాల కరపత్రాలు, వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, డివిజనల్ ఫైర్ ఆఫీసర్ కేశవులు, అసిస్టెంట్ డివిజనల్ ఫైర్ ఆఫీసర్ గోవర్ధన్‌రెడ్డి, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ శివాజీ పాల్గొన్నారు.



బీజేపీకి షాక్..!

- హస్తం పార్టీలోకి బోథ్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు
- కారును వదిలి కాంగ్రెస్‌లోకి నిర్మల్ మున్సిపల్ చైర్మెన్
- అదే బాటలో ఆదిలాబాద్ బల్దియా వైస్ చైర్మెన్ జహీర్‌రంజానీ
- కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన సీఎం రేవంత్‌రెడ్డి
- ఎన్నికల ముంగిట వలసలతో రెండు పార్టీల్లో కలవరం
- లోక్‌సభ స్థానం గెలువడమే లక్ష్యంగా కాంగ్రెస్ అడుగులు

లోక్‌సభ ఎన్నికల ముంగిట బీజేపీకి భారీ షాక్ తగిలింది. ఆ పార్టీకి చెందిన బోథ్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు హస్తం గూటికి చేరడం ప్రాధాన్యం సంతరించుకుంది. తాజాగా సోమవారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. మరోపక్క బీఆర్ఎస్‌కు చెందిన నిర్మల్ మున్సిపల్ చైర్మెన్ గంద్రత్ ఈశ్వర్, ఆదిలాబాద్ బల్దియా వైస్ చైర్మెన్ జహీర్‌రంజానీతో పాటు పలువురు నాయకులు హస్తం పార్టీలో చేరారు. మరోపక్క నిర్మల్‌లో బీఆర్ఎస్‌కు ఇప్పటికే 13మంది కౌన్సిలర్లు రాజీనామా చేయగా.. వీరిలో అధిక మంది హస్తం పార్టీలో చేరుతారనే ప్రచారం జరుగుతోంది. మరోపక్క బోథ్ నియోజకవర్గంలో బీజేపీలో కీలకంగా ఉన్న రాథోడ్ బాపురావు ఆ పార్టీని వీడటం చర్చనీయాంశంగా మారింది. మరోపక్క నిర్మల్, ఆదిలాబాద్‌కు చెందిన పలువురు కీలక నాయకులు ఇప్పటికే బీఆర్ఎస్‌ను వీడటం.. ఎన్నికల నాటికి మరికొందరు అదే బాటలో ఉన్నారనే ప్రచారం జరుగుతుండటం ఆ పార్టీలో కలకలం రేపుతోంది. లోక్‌సభ ఎన్నికల ముగింట నాయకుల వలసలతో బీఆర్ఎస్, బీజేపీలకు తలనొప్పిగా మారగా.. లోక్‌సభ సీటును కైవసం చేసుకోవడంలో ఈ చేరికలు ఉపయోగపడుతాయని కాంగ్రెస్ భావించడం ఆసక్తికరంగా మారుతోంది.



సీఎం రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు, పక్కన మంత్రి సీతక్క, ఎమ్మెల్యే బొజ్జు

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

లోక్‌సభ ఎన్నికల ముంగిట రాజకీయ పార్టీల్లో నాయకుల వలసలు గుబులు రేపుతున్నాయి. ఎవరు ఎప్పుడు పార్టీ మారుతారో తెలియని అయోమయం పరిస్థితి కనిపిస్తోంది. అప్పటి వరకు ఒక పార్టీలో ఉన్న వ్యక్తి..మరుక్షణమే ఇతర పార్టీ కండువా కప్పుకోవడం సాధారణమవుతోంది. తాజాగా పలువురు కీలక నాయకులు పార్టీలు మారడం ఇదే చర్చకు దారితీస్తోంది. ముఖ్యంగా లోక్‌సభ ఎన్నికల ముంగిట ఆదిలాబాద్ జిల్లాలో బీజేపీకి పెద్ద షాక్ తగిలింది. ఇన్నాండ్లు ఆ పార్టీలో బోథ్ నియోజకవర్గంలో కీలక నేతగా ఉన్న మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు కమలం పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇది వరకు బీఆర్ఎస్ నుంచి పదేండ్ల పాటు ఎమ్మెల్యేగా కొనసాగిన ఆయన ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో గులాబీ పార్టీ టికెట్ నిరాకరించింది. దీంతో నిరాశకు గురైన బాపురావు కమలం పార్టీలో చేరారు. ఈ సమయంలో ఎంపీ టికెట్ ఇస్తామని ఆ పార్టీ కీలక నేతలు ఇచ్చిన హామీ మేరకే బీజేపీలో చేరినట్లు ఆయన సన్నిహితులు చెప్పారు. కానీ అనూహ్యంగా బీఆర్ఎస్ నుంచి బీజేపీలో చేరిన మాజీ ఎంపీ గోడం నగేష్‌కు కమలం పార్టీ టికెట్ కేటాయించింది. ప్రస్తుతం సిట్టింగ్ ఎంపీ సోయం బాపురావును కాదని నగేష్‌కు ఇవ్వడంతో ఆయనతో పాటు రాథోడ్ బాపురావు, మాజీ ఎంపీ రాథోడ్ రమేష్ వంటి కీలక నేతలు బీజేపీ అధినాయకత్వం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పార్టీలో ఉన్న వారిని కాదని ఇతర పార్టీ నుంచి వ్యక్తికి టికెట్ ఇవ్వడం పట్ల నిరాశకు గురయ్యారు. ప్రస్తుతం రాథోడ్ బాపురావు కాంగ్రెస్‌లో చేరగా.. సోయం బాపురావు, రాథోడ్ రమేష్‌లు పార్టీకి దూరంగా ఉంటున్నారు. ఇటీవల జరిగిన ఆదిలాబాద్ పార్లమెంట్ క్షేత్రస్థాయి కార్యకర్తల సమావేశానికి ఇరువురు నేతలు దూరంగా ఉండటం ఈ చర్చకు మరింత ఊతమిచ్చింది. రానున్న రోజుల్లో వీరు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారోననేది తీవ్ర ఉత్కంఠకు దారితీస్తోంది. లోక్‌సభ ఎన్నికల ముంగిట కీలక నాయకులు దూరం కావడం పార్టీకి ప్రతికూలంగా మారే అవకాశం ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

కాంగ్రెస్‌లోకి మున్సిపల్ చైర్మెన్..!

అధికారంలో ఉన్నన్ని రోజులు నాయకులు, కార్యకర్తల బలంతో తిరుగులేని శక్తిగా ఉన్న బీఆర్ఎస్ పార్టీ అధికారం కోల్పోగానే పూర్తిగా చతికిలపడుతోంది. ఉమ్మడి జిల్లాలో ఆ పార్టీకి చెందిన కీలక నాయకులు కారు దిగి కాంగ్రెస్‌లో చేరుతుండటం ఆ పార్టీలో మరింత కలవరం రేపుతోంది. తాజాగా నిర్మల్ మున్సిపల్ చైర్మెన్ గంద్రత్ ఈశ్వర్‌తో కాంగ్రెస్‌లో చేరడం ప్రాధాన్యం సంతరించుకుంది. మరోపక్క ఇప్పటికే ఇక్కడ బీఆర్ఎస్‌కు చెందిన పలువురు కీలక నేతలు పార్టీని వీడటంతో పాటు 13 మంది కౌన్సిలర్లు ఆ పార్టీకి రాజీనామా చేశారు. వీరంతా త్వరలోనే కాంగ్రెస్‌లో చేరుతారనే ప్రచారం జరుగుతోంది. మరోపక్క ఆదిలాబాద్ బల్దియా వైస్ ఛైర్మెన్ జహీర్ రంజానీ కారు పార్టీని వదిలి కాంగ్రెస్‌లో చేరడం ప్రాధాన్యం సంతరించుకుంది. బీఆర్ఎస్ హయాంలో పట్టణంలో హజ్‌భవనం నిర్మాణం కాకపోవడం, మైనార్టీ కమ్యూనిటీహాల్ నిర్మాణంలో జాప్యం చోటుచేసుకోవడం వంటి కారణాలతోనే ఆయన పార్టీని వీడినట్లు తెలుస్తోంది. ఆదిలాబాద్ పట్టణంలో మరికొంత మంది కౌన్సిలర్లు సైతం కారు దిగేందుకు సిద్ధమవుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇలా ఉమ్మడి జిల్లాలో నాయకుల వలసలతో బీఆర్ఎస్ ఉక్కిరిబిక్కిరవుతుండగా.. కీలక తరుణంలో నాయకులు పార్టీని వీడటం బీజేపీకి కూడా ఇబ్బందికరంగా మారుతోంది. మరోపక్క ఇతర పార్టీల నుంచి నాయకుల చేరికలతో కాంగ్రెస్ మరింత బలోపేతం దిశగా అడుగులు వేస్తుండటం ప్రాధాన్యం సంతరించుకుంది.



నిర్మల్ మున్సిపల్ ఛైర్మెన్‌కు గంద్రత్ ఈశ్వర్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి



సీఎం రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఆదిలాబాద్ మున్సిపల్ వైస్ చైర్మెన్ జహీర్ రంజానీ

మద్దతు ధరలతో పంట కొనుగోళ్లు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రైతులు పండించిన పంటలను ప్రభుత్వం మద్దతు ధరలతో కొనుగోళు చేస్తుందని అదనపు కలెక్టర్ శ్యామలదేవి అన్నారు. సోమవారం మార్కెట్ యార్డులో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. తొలి రైతును సత్కరించి మిఠాయిలు తినిపించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు పండించిన జొన్నలను పూర్తి స్థాయిలో కొనుగోలు చేసేలా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. 14 శాతంతో క్వింటాల్ జొన్నలకు 3180 రూపాయల మద్దతు ధర ఇస్తున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా తొమ్మిది కేంద్రాలను ఏర్పాటు చేశామని, 66 వేల 900 ఎకరాల్లో జొన్న పంట సాగు అయినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయన్నారు. రైతులు దళారులకు అమ్మకుండా కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ ఏడీ శ్రీనివాస్, మార్క్‌ఫెడ్ డీఎం ప్రవీణ్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



నవతెలంగాణ-జైపూర్

మండల కేంద్రంలో గల ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యాభ్యాసం చేసిన 1998-99 10వ తరగతి బ్యాచ్ విద్యార్థులు సరిగ్గా 25 సంవత్సరాల తర్వాత కలుసుకున్నారు. ఏ పాఠశాలలో విద్యాభ్యాసం చేశారో..అదే పాఠశాలలో అప్పటి పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి ఆదివారం పాఠశాల ఆవరణలో సందడి చేశారు. విద్య నేర్పించిన గురువులతో కలిసి విద్యాభ్యాసం చేసిన తరగతి గదులు, చిన్ననాటి చిలిపి చేష్టలను గుర్తు చేసుకున్నారు. ఉదయం 10గంటల నుండి సాయంత్రం వరకు అక్కడే గడిపారు. 25 సంవత్సరాల తర్వాత కలుసుకున్న విద్యార్థులు నీలం రంగు ప్యాంట్, తెల్లటి షర్టు యునిఫాంతో అపూర్వ సమ్మేళనానికి హాజరు కావడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విద్యార్థులతో పాటు అప్పటి విద్యార్థినులు కూడా యునిఫాం ధరించారు. విద్య నేర్పిన గురువుల సమక్షంలో మళ్లీ చిన్నపిల్లలై ఆడిపాడిన నాటి బాల్యమిత్రులు గురువులపై పూల వర్షం కురిపించారు. శాలువాలతో సన్మానించి వారి ఆశీస్సులు తీసుకున్నారు.

బాల్యానికి గుర్తుగా సోపతి వెల్ఫేర్ సొసైటీ ద్వారా సామాజిక సేవ

1998-99 సంవత్సరంలో 10వ తరగతి పూర్తి చేసి వివిధ రంగాల్లో స్థిరపడిన విద్యార్థులు తమ బాల్యానికి గుర్తుగా సోపతి వెల్ఫేర్ సొసైటీ ఏర్పాటు చేశారు. ఈ సొసైటీ ద్వారా రక్త దానం, అవయవ దానం, విద్యా దానం, ఇబ్బందుల్లో ఉన్న కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలుస్తున్న తీరును గురువుల ఎదుట గుర్తు చేసుకున్నారు. సమాజం పట్ల బాధ్యతగా సోపతి వెల్ఫేర్ సొసైటీ ద్వారా సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్న విద్యార్థులను గురువులు అభినందించారు. సోపతి వెల్ఫేర్ సొసైటీ మరింతగా వర్ధిల్లాలని, ఎంతో మందికి సేవలు అందించాలని ఆకాంక్షించారు.

జీసీడీఓ ఆశ్రమ పాఠశాల ఆకస్మిక తనిఖీ



నవతెలంగాణ-నేరడిగొండ

మండలంలోని లక్కంపూర్ ఆశ్రమ పాఠశాలను సోమవారం జీసీడీఓ మెస్రం ఛాయా ఆకస్మికంగా తనిఖీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 15 నుండి 22 వరకు మొదటి తరగతి నుండి తొమ్మిదవ తరగతి వరకు నిర్వహించబడుతున్న వార్షిక పరీక్షల నేపథ్యంలో తనిఖీ చేశారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

బీజేపీ ఎన్నికల ప్రచారం ప్రారంభం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పదేండ్ల బీజేపీ పాలనలో ఎక్కడ కూడా అవినీతి లేకుండా దేశాన్ని ప్రపంచ దేశాలతో సమానంగా అభివృద్ధి పథంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ తీసుకెళ్తున్నారని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారాన్ని పట్టణంలో సోమవారం రాంనగర్ నుంచి ప్రారంభించారు. ముందుగా కాలనీలోని శివాలయం పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను సత్కరించారు. అక్కడి నుంచి కాలనీలో పర్యటిస్తు ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలను పంపిణీ చేస్తు ప్రచారం చేపట్టారు. కమలం గుర్తుకు ఓటేయ్యాలని ప్రజలను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మూడవ సారి ప్రధాన మంత్రిగా మోడీ కావాలని, అందులో భాగంగా ఎంపీ స్థానాన్ని గెలిపించి బహుమతిగా ఇవ్వాలన్నారు. ప్రచారంలో ఏ ఇంటికి వెళ్లిన బీజేపీకి బ్రహ్మరథం పడుతున్నారన్నారు. గతంలో కాంగ్రెస్ పరిపాలనలో స్కాంలు జరిగాయని, పదేండ్ల మోడీ హయంలో ఎక్కడ కూడా స్కామ్‌లు లేకుండా అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. ఇటీవల ప్రధాన మంత్రి పర్యటన నేపథ్యంలో ఇండస్ట్రీ కారిడార్లు ప్రకటించాలని కోరడం జరిగిందన్నారు. ఆదివారం ఆదిలాబాద్‌ను ఇండస్ట్రీస్ కారిడార్‌గా డిక్లేర్ చేస్తు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని పీఎం కార్యాలయం నుంచి లేఖను పంపించారని తెలిపారు. ఎంఐఎంతో సంబంధం లేదని మాట్లాడిన కాంగ్రెస్ ఇప్పుడు పొత్తు పెట్టుకుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు లాలామున్నా, రఘుపతి, ధోని జ్యోతి, ముకుంద్, అశోక్, స్వామిరెడ్డి, భీంసేన్‌రెడ్డి, సతీష్, పద్మ పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి

- నిర్మల్ కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



నవతెలంగాణ-నిర్మల్

పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో తాగు, సాగు నీటి అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రజలకు తాగు నీటి ఇబ్బందులు రానీయకుండా అవసరమైన ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల వచ్చే రెండు నెలలు కీలకమని, అధికారులంతా అప్రమత్తంగా ఉంటూ తాగునీటి సరఫరా ప్రక్రియలో అంతరాయం కలగకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. తాగునీటి కొరతపై వచ్చే ఫిర్యాదులను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని సూచించారు. నిర్మల్, భైంసా, ఖానాపూర్ మున్సిపాలిటీలలో ప్రతి ఇంటికి మిషన్ భగీరథ నీటిని సరఫరా చేయాలని, పైప్‌లైన్, చేతిపంపులకు అవసరమైన మరమ్మత్తులు చేపట్టి నీటిని అందించాలని తెలిపారు. హరితహారంలో భాగంగా నాటిన మొక్కలు ఎండిపోకుండా నిరంతరం నిరందించాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యతనివ్వాలని, నిరంతరం పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఎండా కాలాన్ని దృష్టిలో ఉంచుకొని జిల్లాలోని రిజర్వాయర్ల నీటిని అవసరాలకు అనుగుణంగా వినియోగించాలని, రైతులకు సాగు నీటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. పంటల అవసరాలను అంచనా వేసి నీటిని విడుదల చేయాలని సూచించారు. నీటి వృథాను అరికట్టేలా కాల్వలకు మరమ్మత్తులు చేపట్టాలని ఆదేశించారు. అధికారులంతా సమన్వయంతో పనిచేసి ప్రజలకు తాగునీరు, సాగునీరుకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో నీటి పారుదల శాఖ ఎస్ఈ సుశీల్ కుమార్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంజి ప్రసాద్, మిషన్ భగీరథ డీఈ సందీప్, నిర్మల్, ఖానాపూర్, భైంసా మున్సిపల్ కమిషనర్లు రాజు, మనోహర్, వెంకటేశ్వర్‌రావ్ పాల్గొన్నారు.

గ్రీన్‌ఫీల్డ్ హైవే బాధితులకు మార్కెట్ రేట్‌తో పరిహారం చెల్లించాలి



నవతెలంగాణ-జైపూర్

నాగాపూర్-విజయవాడ మధ్య నిర్మిస్తున్న గ్రీన్ ఫీల్డ్ హైవే రోడ్డు నిర్మాణంలో నష్టపోతున్న భూములకు మార్కెట్ రేటు ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని వివిధ గ్రామాలకు చెందిన బాధిత రైతులు సోమవారం తహసీల్దార్ వనజారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఎకరం భూమి ఎక్కడ చూసిన రూ.50 వేల నుండి మొదలు రూ.కోటి వరకు అమ్ముడవుతోందన్నారు. ఇంత విలువైన భూములు హైవే రోడ్డు నిర్మాణంలో నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కిష్టాపూర్ శివారులో పార్వతి బ్యారేజ్ నిర్మాణంలో నష్టపోయిన భూములకు 2017 సంవత్సరంలో ఎకరాకు రూ.8లక్షల20 వేల చొప్పున నష్టపరిహారం చెల్లించిన విషయాన్ని గుర్తు చేశారు. 2017లో భూములకు లభించిన మార్కెట్ రేట్ ప్రస్తుతం మూడు వంతులు పెరిగిందన్నారు. సింగరేణి ఓపెన్‌కాస్ట్ గని ఏర్పాటుతో నష్టపోయిన ఇందారం, టేకుమట్ల శివారు భూములకు ఎకరానికి రూ.24 లక్షల చొప్పున నష్టపరిహారం ఇచ్చారన్నారు. ప్రస్తుతం గ్రీన్‌ఫీల్డ్ హైవే రోడ్డులో నష్టపోతున్న భూములకు రూ.4.30లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లిస్తామని ప్రకటించడం బాధాకరమని పేర్కొన్నారు. స్థానిక స్థితిగతులు, మార్కెట్ విలువలు చూడకుండా పరిహారం చెల్లిస్తామంటే భూములను వదులుకోవడానికి సిద్ధంగా లేమని తేల్చి చెప్పారు. ఈ విషయంలో ప్రభుత్వం రైతుల అభ్యర్థన పట్ల సానుకూలంగా స్పందించాలని కోరారు.

ఏసీబీకి చిక్కిన మహిళా ఎస్సై

- రోడ్డు ప్రమాద కేసులో రూ.25వేలు డిమాండ్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రోడ్డు ప్రమాద కేసులో కారు యజమానిపై సాధారణ కేసు నమోదు చేసి వాహనం విడుదల చేయడానికి రూ.25 డిమాండ్ చేసి మహిళా ఎస్ఐ ఏసీబీకి చిక్కింది. బాధితుని ఫిర్యాదు మేరకు ఏసీబీ అధికారులు రైడ్ చేసి ఆసిఫాబాద్ మహిళా ఎస్సై రాజ్యలక్ష్మి లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి వివరాలు వెల్లడించారు. గత నెల 31న మండలంలోని బూరుగూడ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కారు డ్రైవర్ వద్ద నుండి వాహనం విడుదల కోసం ఎస్ఐ రూ.40వేలు డిమాండ్ చేశారు. చివరకు రూ.25వేలకు ఒప్పందం కుదిరింది. బాధితుడు డబ్బులు ఇచ్చే క్రమంలో దాడి చేశామని డీఎస్పీతెలిపారు. ఎస్సైని ఏసీబీ కోర్టుకు అప్పగించనున్నట్లు తెలిపారు. బాధితుడు మంచిర్యాల జిల్లా సీసీసీకి చెందిన యహీయా ఖాన్ మాట్లాడుతూ గత నెల 31న తాము మంచిర్యాల నుండి ఆసిఫాబాద్ వస్తున్న క్రమంలో బూరుగుడ ప్రధాన రహదారిపై ఇద్దరు ద్విచక్ర వాహనంపై వస్తూ తమ కారును ఢీకొట్టారని తెలిపారు. వారిరువురు కూడా మద్యం తాగి వాహనం నడుపుతూ కారును ఢీ కొట్టారని గుర్తించి వెంటనే 108, 100 నెంబర్లకు ఫోన్ చేశానని, ఇదే విషయం పోలీసులకు తెలియజేశానని వివరించారు. అదే రోజు తాను పిటిషన్ ఇవ్వడానికి ప్రయత్నించగా పిటిషన్ తీసుకోలేదని తెల్లవారి మళ్లీ వచ్చి ఎస్ఐ రాజ్యలక్ష్మిని సంప్రదించగా లోక్ అదాలత్ లో కేసు కొట్టి వేసేలా సెక్షన్లు వేస్తామని, రూ.40వేలు ఇవ్వాలని అడిగినట్లు తెలిపారు. ఏప్రిల్ 4న మరోసారి స్టేషన్‌కు వచ్చానని, తిరిగి ఆదివారం స్టేషన్‌కు రాగా రూ.25వేలు ఇవ్వమని అడగగా ఒప్పందం కుదిరిందని తెలిపాడు. వెంటనే ఏసీబీ వారికి సమాచారం అందించానని తెలిపారు. ఏదేమైనా జిల్లా కేంద్రానికి చెందిన ఎస్ఐ ఏసీబీకి పట్టుబడడంతో పోలీస్ శాఖ అప్రమత్తమైంది. ఈ దాడుల్లో ఏసీబీ సీఐలు తిరుపతి, కృష్ణకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నస్పూర్ : మున్సిపాలిటీ పరిధి మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ రామ్మూర్తి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్‌కే-6 సబ్‌స్టేషన్‌లో ఎక్కువ సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్ బిగిస్తున్నందున ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 6గంటల వరకు మధ్య మధ్యలో అంతరాయం కలుగుతుందని తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని శ్రీరాంపూర్, ఆర్కే6 గుడిసెలు, శ్యామ్‌నగర్, సంగం మల్లయ్యపల్లె, ఓల్డ్ ఆంధ్రా బ్యాంక్ సిసి ఏరియా, లక్ష్మీనగర్, గాంధీనగర్, చర్చి ఏరియా, సుభాష్ నగర్, ప్రశాంత్ నగర్, కృష్ణకాలనీ, పిట్టలకాలనీ వాసులు గమనించి సహకరించాలని కోరారు.

2

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక

ఆదిలాబాద్-నిర్మల్

మంగళవారం | ఏప్రిల్ 16, 2024 | www.navatelangana.com

సీఎంని మర్యాదపూర్వకంగా కలిసిన కాంగ్రెస్ మండల నాయకులు



నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండల కాంగ్రెస్ నాయకులు ఒడ్నాల రాజేశ్వర్, ఈటెల శ్రీనివాస్‌లు సోమవారం సీఎం రేవంత్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నాయకులు నిర్మల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు ఆధ్వర్యంలో ఆదిలాబాద్ ఎంపీ స్థానాన్ని గెలుస్తామని సీఎంకు వివరించారు. నాయకులు, కార్యకర్తలు కలిసి కట్టుగా పనిచేసి, పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండాను ఎగురవేయాలని సూచించారు.

ఉదారత చాటుకున్న ఆటో డ్రైవర్లు

నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రానికి చెందిన ఆటో డ్రైవర్‌లు ఉదారత చాటుకున్నారు. తమకు దొరికిన సెల్‌ఫోన్‌నీ బోథ్ పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. సోమవారం బోథ్‌కు చెందిన ఆటో డ్రైవర్‌లు మజర్, ఖలీల్, ఫైసల్‌లకు బస్టాండ్‌లో వారికి చాలా విలువైన ఫోన్ దొరికింది. వెంటనే పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణ్‌కి అప్పగించారు. అలాగే పోలీసులు సంబంధిత వ్యక్తికి వారి సమక్షంలో అందజేశారు. ఉదారత చాటుకున్న ఆటో డ్రైవర్ యూనియన్ సభ్యులకు ప్రజలు అభినందనలు తెలిపారు.



ఉపాధి హామి కూలీల సమస్యలు పరిష్కరించాలి

- వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు లంక రాఘవులు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఉపాధి హామి కూలీల సమస్యలను పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు లంక రాఘవులు అన్నారు. సోమవారం డీఆర్డీఓ సాయన్నను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆదిలాబాద్ జిల్లాలో 468 గ్రామ పంచాయతీలలో 1.71 లక్షల జాబ్ కార్డులు ఇచ్చారు. 3.46 లక్షల కూలీలున్నారని అన్నారు. ఆదిలాబాద్ జిల్లా తెలంగాణ రాష్ట్రంలోనే అత్యంత వెనుక బడిన జిల్లా 36శాతం గిరిజనులు, 18శాతం దళితులు, 40శాతం పైగా బీసీలు ఉన్న జిల్లా అని అన్నారు. వ్యవసాయంపై ఆధారపడి జీవించేవారు 75శాతం మంది ఉన్నారని తెలిపారు. అత్యధికంగా కూలీ చేసుకుని జీవించేవారు ఎక్కువని అన్నారు. ఉపాధి హామి చట్టం జిల్లాకు వరం లాంటిదని ఉపాధి పనులు ఎక్కువగా జరుగటానికి అనుకూలమైన జిల్లా అన్నారు. జిల్లాలో కూలీలు అనే సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకొని వరంలాంటి పథకాన్ని ప్రవేశపెట్టిందని కాని ఇప్పుడు అనేక నిబంధనలతో పాటు జిల్లాలో అధికారుల నిర్లక్ష్యం వల్ల కూలీలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. నెలల తరబడి కూలీ డబ్బులు ఇవ్వక పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వారానికి ఒక్కసారి పేస్లిప్స్ ఇవ్వడం లేదని, రోజు కూలి రూ.300 ఇస్తామని అధికారులు చెప్తున్నా, రూ.100, 150 కూలీ డబ్బులే చెల్లిస్తున్నారన్నారు. మంచి నీళ్ల, పారగుల్ల, గడ్డపార లాంటి సౌకర్యాలు కల్పించడం లేదన్నారు.

పథకంలోని ప్రతి అంశాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

ఉపాధి హామి చట్టంలోని ప్రతీ అంశాన్ని పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని, ప్రతీ కూలికి వారానికి ఒకసారి పేస్లిప్ ఇవ్వాలన్నారు. కొలతతో సంబంధం లేకుండా రోజు కూలీ రూ.300 చెల్లించాలన్నారు. సమ్మర్ అలవెన్స్ డబ్బులను చెల్లించాలని ప్రతీ కూలీకి 100శాతం పనులు కల్పించాలని, కూలీలకు ఈ పథకం గురించి, కొత్త నిబంధనల గురించి అవగాహన కల్పించాలని అన్నారు.

గతంలో ఇచ్చిన సౌకర్యాలను ఇప్పుడు ఇవ్వాలన్నారు. టెంట్ మంచినీళ్ల, పార, గడ్డపార, గుల్లలు, ప్రాథమిక చికిత్స కల్పించాలని, ప్రమాదంలో గాయపడ్డా, చనిపోయిన, అంగవైకల్యులుగా మారిన వారికి నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కూలీల ఇష్టాన్ని బట్టి పోస్టు ఆఫీస్, బ్యాంకు నుంచి కూలి డబ్బులు చెల్లించాలని అన్నారు. పాత బాకీ కింది కూలి డబ్బులను కట్ చేసుకోవటాన్ని ఆపాలన్నారు. కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించడానికి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి తమ సంఘ నాయులను, కూలిల ప్రతినిధులను భాగస్వామి చేసి పరిష్కరించాలని కోరారు. పట్టణాల్లో ఉపాధి హామి పథకాన్ని అమలు చేయాలని, కూలీలకు వ్యతిరేకంగా, ఉపాధి హామి చట్టానికి భిన్నమైన, కొత్తగా ప్రవేశ పెట్టిన కేంద్ర ప్రభుత్వ నిబంధనలను రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు స్వామి, జిల్లా నాయకులు ఆశన్న, అన్నమొల్ల కిరణ్, జిల్లా నాయకురాలు పొచ్చక్క ఉన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీజేపీ నాయకులు



నవతెలంగాణ-నేరడిగొండ

మండల బీజేపీ నాయకులు సోమవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి నివాసంలో మంత్రి సీతక్క, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సత్తు మల్లేష్, బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడె గజేందర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో బీజేపీ నేరడిగొండ అధ్యక్షుడు హిరాసింగ్, గిరిజన మోర్చ జిల్లా ప్రధాన కార్యదర్శి తొడసం శంకర్, జిల్లా కార్యవర్గ సభ్యులు గంధం నవీన్, నేరడిగొండ మండల ప్రధాన కార్యదర్శి సోలాంకి ప్రశాంత్‌లు ఉన్నారు. ఈ సందర్భంగా హిరాసింగ్ మాట్లాడుతూ బీజేపీ రోజు రోజుకు అంతర్గత విబేదాలు పెరుగుతున్నాయని అన్నారు.

జొన్న కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ప్రభుత్వం మార్క్‌ఫెడ్, పీఏసీఎస్ ఆధ్వర్యంలో జొన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిందని వాటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మార్కెట్ కమిటీ కార్యదర్శి ఎం.రాజేశ్వర్ అన్నారు. సోమవారం స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీలో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ప్రభుత్వం క్వింటాల్ జొన్నలు మద్దతు ధర రూ.3,180తో కొనుగోలు చేస్తుందన్నారు. రైతులు తమ వెంట పట్టా పాస్‌బుక్, బ్యాంక్ ఖాతా జిరాక్స్, ఆధార్ కార్డును తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఓ గణేష్, సీఈఓ ధరమ్ సింగ్, సునీల్ పాల్గొన్నారు.

గుండె పోటుతో మాజీ ఉపసర్పంచ్ మృతి

నవతెలంగాణ-తలమడుగు



మండలంలోని కొత్త నందిగామ గ్రామపంచాయతీ మాజీ ఉపసర్పంచ్ ఆత్రం తెలంగ్‌రావు(56) ఆదివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. కుటుంబ సభ్యులు గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం రాత్రి చాతిలో నొప్పి వస్తుందని కుటుంబ సభ్యులకు తెలుపగా వెంటనే రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్టు తెలిపారు. మృతుడు గతంలో రాయిసెంటర్ అధ్యక్షుడిగా, మాజీ ఉపసర్పంచ్‌గా పని చేసినట్టు తెలిపారు. మృతుడికి భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడు తెలంగ్‌రావు భౌతిక కాయానికి జెడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి, మండల కాంగ్రెస్ నాయకుడు రాజేశ్వర్, మాజీ జెడ్పీటీసీ బాబన్న, వెంకన్న, ప్రతాప్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు కేదారేశ్వర్‌రెడ్డి, మాజీ సర్పంచులు ఎంపీటీసీలు పలువురు నాయకులు నివాళు లర్పించారు.

బెల్ట్ షాపుల్లో మద్యం విక్రయిస్తే చర్యలు



నవతెలంగాణ-సారంగాపూర్

అనుమతి లేకుండా బెల్ట్ షాపుల్లో మద్యం విక్రయిస్తే చర్యలు తప్పవని ఎస్సై చంద్రమోహన్ అన్నారు. సోమవారం మండలంలోని బోరిగామలో అక్రమంగా మద్యం అమ్మకాలు జరుపుతున్న వ్యక్తిపై కేసు నమోదు చేసి అతని వద్ద నున్న 16 లీటర్ల మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై తెలిపారు. ఈ దాడిల్లో ఏఎస్సై వసంత్, ఇద్దరు పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ప్రజలకు రుణపడి ఉంటా



నవతెలంగాణ-ఉట్నూర్

మండల కేంద్రంలోని కొత్త బస్టాండ్ అవరణంలో ఉన్న చెత్తను, వాడల్లోని రోడ్డును శుభ్రం చేసి, ప్రజల రుణాలను తీర్చుకోవడమే నా పని అని మాజీ సర్పంచ్ బొంత ఆశారెడ్డి అన్నారు. సోమవారం గ్రామపంచాయతీ సిబ్బంది వారి పనులు వారు చేస్తుంటారు. మన పని మనం ఒక సేవా భావంతో చేయాలని స్వచ్ఛ భరత్‌లో భాగంగా ఎవరైనా చేయచ్చునని అన్నారు. ఉట్నూర్ గ్రామపంచాయతీలో ఎక్కడ చెత్త కనబడిన, రోడ్డు శుభ్రం లేకున్నా నేను ముందుండి లేబర్‌గా పని చేస్తానని అన్ని అన్నారు. ఎవరు ఎమన్నా నాపని నేను చేస్తూ ముందుకు సాగుతానని తెలిపారు.

మాదక ద్రవ్యాల వినియోగానికి దూరంగా ఉండాలి

నవతెలంగాణ-నార్నూర్

మాదక ద్రవ్యాల వినియోగానికి ప్రజలు దూరంగా ఉండాలని సీఐ రహీమ్ పాషా, ఎస్సై రవికిరణ్ అన్నారు. సోమవారం మండలంలోని సుంగాపూర్ గ్రామంలో గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో మాదక ద్రవ్యాల వినియోగానికి దూరంగా ఉండాలని సూచించారు. గంజాయి, గుడుంబా విక్రయిస్తే వారిపై కేసులు నమోదు చేసి, కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రభుత్వం గంజాయి వినియోగం అక్రమ రవాణా, మాదక ద్రవ్యాల విషయంలో ప్రత్యేక ప్రణాళికలు రచించి, రాష్ట్రంలో గంజాయి నిర్మూలన లక్ష్యంగా పని చేస్తుందని అన్నారు. ప్రతి ఒక్కరూ గంజాయి, మాదక ద్రవ్యాల వినియోగానికి దూరంగా ఉండాలని సూచించారు. వారి వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.

భారీ మెజార్టీతో గెలుస్తాం

- డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి



నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ భారీ మెజార్టీతో గెలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సోమవారం ప్రజాసేవ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న గ్యారంటీ హామీలే, పార్లమెంట్ అభ్యర్థుల విజయాలకు బాటలుగా మారుతాయని అన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకొచ్చిన 100 రోజుల్లోనే ఇచ్చిన ఆరు గ్యారంటీలలో ఐదు అమలు చేసిందని అన్నారు. ఇక బీజేపీ గత పదేండ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్నా తెలంగాణా రాష్ట్రానికి ఒరిగింది సున్నా అని విమర్శించారు. ప్రధాని మోడీ ఇచ్చిన హామీలేవి తీర్చలేదన్నారు. ప్రతి ఒక్కరి ఖాతాల్లో రూ.15 లక్షలు వేస్తానని మోసం చేశారని అన్నారు. సంవత్సరానికి 2 కోట్ల ఉద్యోగాల హామీ ఏమైందని ప్రశ్నించారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు గుడిపెల్లి నగేష్, జిల్లా మహిళా అధ్యక్షురాలు మంచికట్ల ఆశమ్మ, కౌన్సిలర్ సాయి ప్రణయ్, శ్రీ లేఖ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు బాయిన్‌వార్ గంగా రెడ్డి, పోరెడ్డి కిషన్, బండి దేవిదాస్ చారి, భోజారెడ్డి, సుధాకర్‌గౌడ్, కందుల సుకేందర్, మైనారిటీ నాయకులు ఎంఏ షకీల్, ఖయ్యూం, పత్తి ముజ్జు, ఖలీం, రఫీక్, షేక్ మన్సూర్, కర్మ, అంజద్‌ఖాన్, షేక్ షాహిద్, మెస్రం చిత్రు, జగదీశ్వర్‌రెడ్డి, ప్రకాష్‌రెడ్డి పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దళితుల అభివృద్ధికి కృషి

- కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ



నవతెలంగాణ-నార్నూర్

దళితుల అభివద్ధికి తనవంతు కృషి చేస్తానని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సుగుణ అన్నారు. సోమవారం గాదిగూడ మండలంలోని మెడిగూడ గ్రామంలో నిర్వహించిన డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతి కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. జయంతి కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎస్సీ ఉపకులాల జాతీయ అధ్యక్షుడు ఖైరి వెంకటేష్ హాజరైయ్యారు. ముందుగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ అభ్యర్థి సుగుణ మాట్లాడారు. భూ పహానీలపై బ్యాంకు రుణాలు, ఇల్లు లేని కుటుంబాలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు, ఎస్సీ కార్పొరేషన్ లోన్ తదితర సంక్షేమ పథకాల మంజూరు చేసేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. జాతీయ అధ్యక్షుడు ఖైరీ వెంకటేష్ మాట్లాడుతూ నేటి సమాజంలో యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి, మంచిగా చదువులు చదివి ఉద్యోగాలు సాధించాలని అన్నారు. సమాజ అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. ఉమ్మడి మండలానికి వచ్చిన ఖైరి వెంకటేష్‌కు నాయకులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో ప్యాక్స్ డైరెక్టర్ కాంతారావ్, దళిత రత్న నర్సింగ్ మోరే, ఏజెన్సీ షెడ్యూల్ కులాల సమితి జిల్లా అధ్యక్షులు మోటేరావ్ అనిల్, మోరే కిషన్, మహేందర్ దుర్గే, జి.సంజీవ్, బలరాం, సురేష్, విజయ్, బాలాజీ, సిదర్థ్, యశ్వంత్, ఉత్తం, అమృత్, సుద్దాం, కేర్బా, గంగాధర్, రాము, మారుతి, తాతేరావ్ పాల్గొన్నారు.

పరీక్ష గదుల్లో మౌలిక వసతులు కల్పించాలి



నవతెలంగాణ-బోథ్

పరీక్ష తరగతి గదుల్లో మౌలిక వసతులు కల్పించాలని జీసీడీఓ మెస్రం ఛాయా అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో ఒకటవ తరగతి నుంచి తొమ్మిదవ తరగతి వరకు నిర్వహిస్తున్న ఎస్సే-2 పరీక్ష కేంద్రాలను సందర్శించారు. అలాగే పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు మంచినీటి సౌకర్యంతో పాటు మరిన్ని వసతులు కల్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎన్నికలకు రాజకీయ పార్టీలు సహకరించాలి

- 18 నుంచి నామినేషన్‌ల స్వీకరణ
- కలెక్టర్ రాజర్షిషా

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని కలెక్టర్ రాజర్షిషా కోరారు. పార్లమెంటు ఎన్నికలను పురస్కరించుకుని సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల్లో పోటీ చేయదలచిన అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసే సమయంలో పాటించాల్సిన నియమ నిబంధనలు, అవలంభించాల్సిన విధానాల గురించి క్షుణ్ణంగా వివరిస్తూ అవగాహన కల్పించారు. నామినేషన్ ఫారం-2ఏ ను రిటర్నింగ్ అధికారి కార్యాలయం నుంచి ఉచితంగా పొందవచ్చని సూచించారు. కలెక్టరేట్‌లో ఆర్ఓ కార్యాలయం ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ నెల 18 నుంచి నామినేషన్లను స్వీకరించడం జరుగుతుందని అన్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల సమయంలో నామినేషన్లను అందించాల్సి ఉంటుందని తెలిపారు. సెలవు రోజు ఆదివారం మినహాయించి, మిగితా అన్ని పని దినాలను కలుపుకుని, తుది గడువు ఈ నెల 25 తేదీ మధ్యాహ్నం 3గంటల వరకు నామినేషన్లు స్వీకరించబడతాయని అన్నారు. నిర్ణీత గడువు, నిర్ణీత సమయంలోపు రిటర్నింగ్ అధికారి వద్దకు చేరుకున్న వారి నామినేషన్ ఫారాలు మాత్రమే స్వీకరించడం జరుగుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు.

నాలుగు సెట్ల నామినేషన్లు దాఖలు చేయొచ్చు...

ఒక అభ్యర్థి నాలుగు సెట్ల నామినేషన్లు దాఖలు చేయవచ్చని, అభ్యర్థి వెంట మరో నలుగురిని మాత్రమే లోనికి అనుమతిస్తారని తెలిపారు. జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీల తరపున పోటీ చేసే అభ్యర్థులకు వారు పోటీ చేసే నియోజకవర్గంలోని ఎవరైనా ఒక ఓటరు నామినేషన్‌ను ప్రతిపాదిస్తే సరిపోతుందని స్పష్టం చేశారు. అదే రిజిస్టర్డ్ రాజకీయ పార్టీల తరపున పోటీ చేసే వారికి, స్వతంత్ర అభ్యర్థులకు 10 మంది ఓటర్లు నామినేషన్‌ను ప్రతిపాదించాల్సి ఉంటుందని సూచించారు. అభ్యర్థులు ఇటీవల కాలంలో మూడు నెలలలోపు దిగిన ఒకటి పాస్‌పోర్ట్ సైజు ఫోటో అఫిడవిట్ పై అతికించాలని, నామినేషన్ పత్రంపై స్టాంప్ సైజు ఫోటో అతికించాలని అన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు వేరే పార్లమెంటు సెగ్మెంట్‌కు చెందినవారైన పక్షంలో తప్పనిసరిగా వారి అసెంబ్లీ సెగ్మెంట్ ఈఆర్ఓ నుంచి ఓటరు ధృవీకరణ పత్రం సమర్పించాలని తెలిపారు. రిజిస్టర్డ్, గుర్తింపు పొందని పార్టీల అభ్యర్థులు, స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్ ఫారంలోని పార్ట్-3లో 'సి' కాలం ఎదురుగా ఎన్నికల సంఘం నిర్దేశించిన గుర్తులలో ఏవైనా మూడు గుర్తులను ప్రాధాన్యతా క్రమంలో ఎంపిక చేస్తూ వివరాలు పొందుపర్చాలన్నారు. ముఖ్యంగా ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు తప్పనిసరిగా కొత్త బ్యాంకు అకౌంట్ తెరవాలని, దీని ద్వారానే ఎన్నికల వ్యయానికి సంబంధించిన లావాదేవీలు నిర్వహిస్తూ పక్కాగా రికార్డులు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. అభ్యర్థులు గరిష్ఠంగా రూ.95 లక్షల వరకు ఎన్నికలలో ఖర్చు చేయవచ్చని, సంబంధిత బ్యాంకు అకౌంట్ లావాదేవీల ఆధారంగానే అభ్యర్థుల వ్యయాన్ని లెక్కించడం జరుగుతుందన్నారు. బ్యాంకు అకౌంట్ తెరిచే విషయంలో ఏమైనా ఇబ్బందులు ఎదురైతే తమ దృష్టికి తేవాలని సూచించారు. అభ్యర్థులు తమపై ఏవైనా క్రిమినల్ కేసులు ఉంటే నామినేషన్ పత్రంలోని పార్ట్-3ఏ లో వాటి వివరాలను తప్పనిసరిగా పొందుపర్చాలని అన్నారు.

ఆర్ఓ కార్యాలయం వద్ద హెల్ప్ డెస్క్ ఏర్పాటు...

నామినేషన్ దాఖలు చేసేందుకు అభ్యర్థి, లేదా ప్రతిపాదించిన వారే స్వయంగా హాజరై నామినేషన్ దాఖలు చేయాల్సి ఉంటుందని, అభ్యర్థులు ఆర్ఓ సమక్షంలో ఎన్నికల సంఘం నిర్దేశించిన ప్రతిజ్ఞ చేయాల్సి ఉంటుందని తెలిపారు. గడిచిన పది సంవత్సరాల కాలంలో ఎవరైనా అభ్యర్థులు ప్రభుత్వ క్వార్టర్లలో ఉన్నట్లయితే, నీటి బిల్లులు, కరెంటు బిల్లులు వంటివి బకాయిలు లేవని నోడ్యూ సర్టిఫికెట్ జతపర్చాలని సూచించారు. నామినేషన్ సమర్పించే ముందు అన్ని అంశాలను క్షుణ్ణంగా చూసుకోవాలని హితవు పలికారు. అభ్యర్థులకు సహాయపడేందుకు ఆర్ఓ కార్యాలయం వద్ద హెల్ప్ డెస్క్ సైతం ఏర్పాటు చేస్తామని కలెక్టర్ తెలిపారు. దాఖలైన నామినేషన్లను ఈ నెల 26న పరిశీలించడం జరుగుతుందని, నామినేషన్ల ఉపసంహరణకు 29వ తేదీ చివరి గడువు అని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రచార సభలు, సమావేశాలు, ర్యాలీలకు ముందస్తుగానే దరఖాస్తులు చేసుకుని అనుమతి పొందాలని సూచించారు. కరపత్రాలు, పోస్టర్లు, ఫ్లెక్సీలు వంటివి ముద్రించే విషయంలో ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 127 -ఏ సూచనలు పాటించాలన్నారు. ఎన్నికల ప్రచార ప్రకటనలు,



ప్రచార అంశాలు, ఎల్ఈడీ డిస్‌ప్లే కంటెంట్ తదితర వాటికి ఎంసీఎంసీ ద్వారా అనుమతులు తీసుకోవాలని సూచించారు. అలాగే, అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో నిర్వహించే సభలు, సమావేశాలు, ర్యాలీలు, మైకులు, వాహనాల కోసం సంబంధిత సహాయ రిటర్నింగ్ అధికారుల (ఏఆర్ఓ) నుండి అనుమతి తీసుకోవాలని అన్నారు. పార్లమెంటు నియోజకవర్గం పరిధి మొత్తంలో నిర్వహించే ప్రచార కార్యక్రమాలు, ఎల్ఈడీ వాహనాలు, ఛాపర్, హెలిప్యాడ్, హెలికాప్టర్ వంటి వాటి అనుమతులను ఆర్ఓ కార్యాలయం నుంచి పొందాలని సూచించారు. కనీసం 48 గంటల ముందు సువిధ పోర్టల్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని హితవు పలికారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీవో వినోద్ కుమార్, ఆదిలాబాద్, నిర్మల్, కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాల వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

శ్మశాన స్థలం కబ్జాపై తహసీల్దార్‌కు ఫిర్యాదు

నవతెలంగాణ-బెజ్జూర్



మండలం మంజంపల్లి గ్రామంలో స్మశాన వాటిక స్థలం కబ్జాకు గురైందని గ్రామస్తులు తెలిపారు. ఈ విషయమై సోమవారం తహసీల్దార్ భూమేశ్వర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ముంజంపల్లి గ్రామంలోని 100 సంవత్సరాల స్మశాన వాటిక స్థలంను రుద్రపూర్ గ్రామానికి చెందిన కోట్రంగి హనుమంతు కబ్జా చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. స్మశాన వాటిక స్థలాన్ని పరిశీలించి, గ్రామస్తులకు స్మశాన వాటిక కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముంజంపల్లి మాజీ ఉపసర్పంచ్ గజం అశోక్, డోకే వెంకన్న, తొర్రెం బానయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ

నవతెలంగాణ-కౌటాల



ఎండ తీవ్రత ఎక్కువ ఉన్నందున మండలంలోని వీర్దండి ఐటీడీఏ ప్రాథమిక పాఠశాలలో ఎస్సీఆర్పీ మడావి పోచాని సోమవారం విద్యార్థులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చల్లని నీళ్ల కోసం కుండలు ఏర్పాటు చేయాలన్నారు. వడ దెబ్బ తగలకుండా విద్యార్థులు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో విద్యార్థులకు ఉపాధ్యాయులు సూచనలు చేయాలన్నారు. ఆయన వెంట ఆశా వర్కర్ ఉన్నారు.

ఓపెన్ పది, ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

- కలెక్టర్ వెంకటేష్ దోత్రే
- టాస్ పరీక్షలపై సమీక్షా సమావేశం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఈనెల 25 నుండి ప్రారంభమయ్యే ఓపెన్ పది, ఇంటర్ పరీక్షలు(టాస్) పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే సూచించారు. ఓపెన్ 10, ఇంటర్ పరీక్షలపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో జరిగే ఓపెన్ పదవ తరగతి పరీక్షల కోసం రెండు సెంటర్లు, ఇంటర్మీడియట్ పరీక్షల కోసం రెండు సెంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దీనిలో భాగంగా పదవ తరగతికి ఏర్పాటు చేసిన సెంటర్లలో 368 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారని, ఇంటర్మీడియట్ కోసం ఏర్పాటు చేసిన సెంటర్లలో 284 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు పేర్కొన్నారు. వీరి కోసం అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈనెల 25 నుండి వచ్చే నెల 2 వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు, ఉదయం 9:30 నుండి 12:30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. కేంద్రానికి వచ్చే విద్యార్థులు సెల్ ఫోన్ తీసుకు రాకుండా చూడాలన్నారు. పరీక్ష సమయంలో పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ ప్రభాకర్ రావు, జిల్లా విద్యాధికారి అశోక్, డిఆర్ఓ లోకేశ్వరరావు, జిల్లా పరీక్షల సహాయ సంచాలకులు ఉదయ్ బాబు, డిఆర్డిఓ సురేందర్, జిల్లా వైద్యాధికారి తుకారాం బట్, భగీరథ ఈఈ వెంకటపతి, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు ప్రారంభించాలి

అమ్మ ఆదర్శ పాఠశాలల అభివృద్ధి పనుల్లో భాగంగా పాఠశాలల్లో బాలికల కోసం చేపడుతున్న మరుగుదొడ్ల నిర్మాణ పనులను త్వరితగతిన ప్రారంభించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే ఆదేశించారు. జిల్లాలోని వివిధ శాఖల అధికారులతో అమ్మ ఆదర్శ పాఠశాల అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని గ్రామాల్లో మున్సిపాలిటీలో ఉన్న 170 పాఠశాలల్లో బాలికల కోసం ప్రత్యేకంగా నిర్మించే మరుగుదొడ్ల నిర్మాణ పనులను త్వరితగతిన ప్రారంభించి మే 10 లోపు పూర్తి చేయాలన్నారు. అభివృద్ధి పనులకు సంబంధించి ఎస్టిమేట్ ప్రజలను ఇంజనీరింగ్ అధికారులు వెంటనే సమర్పించాలన్నారు. మరుగుదొడ్ల నిర్మాణం కోసం విద్యాశాఖ, గ్రామీణ అభివృద్ధి శాఖ, ఇంజనీరింగ్ శాఖ, అధికారులు సమన్వయంతో పనిచేసి నిర్దేశించిన లక్ష్యాన్ని త్వరగా చేరుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో డిఆర్డిఓ సురేందర్, డిఇఓ అశోక్, ఆర్అండ్‌బి ఈఈ పెద్దన్న, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండలంలోని వివిధ గ్రామాల్లో ఎస్పీ కే. సురేష్ కుమార్ ఆదేశాల మేరకు టాస్క్ ఫోర్స్ అధికారులు సమాచారం మేరకు దాడులు నిర్వహించారు. ఆదివారం రాత్రి టాస్క్ ఫోర్స్, పోలీసులు ఎల్లూరు గ్రామంలో తనిఖీలు చేశారు. ఎల్లూరు గ్రామం లోని ఎండీ ముబాషీర్ ఇంట్లో తనిఖీ చేపట్టగా తరలించేందుకు సిద్ధంగా ఉన్న 15 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నారు. బియ్యాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించి ఒకరిపై కేసు నమోదు చేసినట్లు టాస్క్ ఫోర్స్ సీఐ రాణా ప్రతాప్ తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల నుండి మహారాష్ట్రకు అక్రమంగా పీడీఎస్ బియ్యం తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో తనిఖీలు చేశామన్నారు. ఎవరైన సబ్సిడి బియ్యం తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. తనిఖీలో టాస్క్‌ఫోర్స్ పీసీ మధు, రమేష్, సంజీవ్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. రెబ్బెన మండలం ఇంద్రనగర్‌లోని స్వయంభు వెలసిన కనకదుర్గ ఆలయం వద్ద ఈనెల 23, 24, 25 తేదీలలో జరగనున్న జాతర మహోత్సవ ఆహ్వాన పత్రికను ఆలయ ప్రధాన అర్చకుడు దేవర వినోద్ ఎమ్మెల్యేకు అందజేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంద్రనగర్ కనకదుర్గమ్మ ఆలయం ఎంతో ప్రసిద్ధి చెందిందని భక్తులకు కొంగుబంగారంగా నిలుస్తుందన్నారు. జాతర వేడుకల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొలని అర్చకుడు వినోద్ కోరారు. ఈ కార్యక్రమంలో భక్తులు తిరుపతి, సురేష్, సంతోష్, జీవన్ పాల్గొన్నారు.

రాష్ట్ర రాజధానిలో అంబేద్కర్‌కు అవమానం

నవతెలంగాణ-కెరమెరి

రాష్ట్ర రాజధానిలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను కాంగ్రెస్ పార్టీ అవమానించిందని బీఆర్ఎస్ ఎస్సీ సెల్ మండల నాయకులు కంబాల వినేష్ అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రమంత అంబేద్కర్ జయంతి వేడుకలను పండగల జరుపున్నట్టు తెలిపారు. కానీ రాష్ట్ర రాజధాని నడిబొడ్డులో ప్రపంచంలోనే ఎత్తైనా 125 అడుగుల విగ్రహనికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేయకపోవడం విడ్డురమన్నారు. దళిత రత్నానికి కాంగ్రెస్ ఇచ్చే గౌరవం ఇదేనా అంటూ ప్రశ్నించారు. కాంగ్రెస్ తీరు అంబేద్కర్‌ను అవమానించే విధంగా ఉందని విమర్శించారు.

నవభారత సాక్షరతతో వంద శాతం అక్షరాస్యత

- కలెక్టర్ వెంకటేష్ దోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని ప్రతి ఒక్కరిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దే విధంగా నవభారత సాక్షరతా కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. సోమవారం జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్‌తో కలిసి ఉన్నతాధికారుల సంధాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి ఒక్కరిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు నవభారత సాక్షరతా కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో 90,828 మంది 15 సంవత్సరాలకు పైగా నిరక్షరాస్యులున్నారని, వీరందరి దశల వారీగా 5 సంవత్సరాలలో అక్షరాస్యులుగా మార్చాలని లక్ష్యంగా నిర్దేశించామని, మొదటి దశలో 14979 మందిని అక్షరాస్యులుగా మార్చాలని నిర్ణయించామన్నారు. ముందుగా చదవడం, రాయడం, చిన్నచిన్న లెక్కలు నేర్పించినంతరం క్రిటికల్ లైఫ్ స్కిల్స్‌లో ఫోన్ వినియోగం, డిజిటల్ లిటరసిని నేర్పిస్తారన్నారు. ఒకేషనల్ స్కిల్స్ ద్వారా అక్షరాస్యతతో పాటు ఆర్థిక వనరులు పొందే మార్గాలను సూచించడం, ఫౌండేషన్ స్కిల్స్ నేర్చుకున్న వారికి ప్రాథమిక విద్య, ఆపై వాటిని నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూల్స్ ద్వారా నేర్పించి ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తామని వివరించారు. నేర్చుకున్న విద్యను మర్చిపోకుండా ఉండే విధంగా నిరంతర అభ్యాసన వస్తువులను కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమ నిర్వహణలో భాగంగా గ్రామస్థాయిలో ప్రధానోపాధ్యాయులు సూపర్‌వైజర్‌గా, ఒక ఉపాధ్యాయుడు టీచర్‌గా, మరొక ఉపాధ్యాయుడు సర్వేయర్‌గా విధులు నిర్వహిస్తారన్నారు. ఎప్పటికప్పుడు వివరాలను ఉల్లాస్ యాప్‌లో నమోదు చేస్తామని పేర్కొన్నారు. జిల్లాలో మొదటి దశలో పురుషులు 5992, మహిళలు 8987 మందిని అక్షరాసులుగా తీర్చిదిద్దాల్సి ఉంటుందని, ఇందు కోసం ఒక ప్రత్యేకమైన వాచకం, అక్షర వికాసం ముద్రించడం జరిగిందని తెలిపారు. ఇందులో 16 పాఠాలు 124 పేజీలు ఉంటాయని, 200 గంటలలో బోధించాల్సి ఉంటుందని, వాచకం పూర్తి అయిన తరువాత 150 మార్కుల ప్రశ్న పత్రం ఇవాల్సి ఉటుందన్నారు. 33 శాతం మార్కులు పొందిన వారిని ఉత్తీర్ణులైనట్లుగా భావించి పత్రాలు అందిస్తామన్నారు. నవభారత సాక్షరతా కార్యక్రమాన్ని జిల్లాలో పకడ్బందీగా అమలు చేసి నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు అధికారుల సమన్వయంతో కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉన్నతాధికారులు, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి , జిల్లా గ్రామీణ అభివద్ధి అధికారి, జిల్లా పంచాయతీ అధికారి, జిల్లా సంక్షేమ అధికారి, జిల్లా లైజనింగ్ అధికారి వంగల నాగరాజు, సమగ్ర శిక్ష కమ్యూనిటీ మొబిలైజేషన్ సమన్వయకర్త కటకం మధూకర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

చెక్‌పోస్ట్ ఎత్తివేత మతలబేంటో..?

- ఈ నెల 3న హుడ్కిలి చెక్‌పోస్టు తొలగింపు
- కారణం తెలియక అయోమయంలో జనం
- ఈ మార్గం గుండా అక్రమ మద్యం, డబ్బు రాదా..?



తొలగించిన హుడ్కిలి చెక్‌పోస్టు ఇదే

నవతెలంగాణ-సిర్పూర్(టి)

పార్లమెంటు ఎన్నికల దృష్ట్యా ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటర్లను ప్రలోభలకు గురి చేసే ఏ వస్తువు కూడా నియోజకవర్గంలో రాకుండా చెక్‌పోస్టుల ఏర్పాటుకు ఆదేశాలు జారీ చేసింది. ఇందులో భాగంగానే సిర్పూర్(టి) అసెంబ్లీ నియోజకవర్గంలో చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. మహారాష్ట్రకు సరిహద్దున ఉండడంతో నిత్యం ఇక్కడ వాహనాలు తనిఖీ చేస్తు లక్షల రూపాయల డబ్బులు ఎలాంటి ఆధారాలు లేకుండా తీసుకెళ్తుండగా పోలీసులు సీజ్ చేసి ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ బృందాలకు అప్పగించారు. చెక్‌పోస్టుల వద్ద రాత్రి పగలు విధులు నిర్వహిస్తు అక్రమ మార్గం ద్వారా నియోజకవర్గంలో డబ్బు, మద్యం రాకుండా చూస్తున్నారు.

మూడు అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులు

నియోజకవర్గంలో మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతంలోని సిర్పూర్, బెజ్జూర్, కౌటాలలో మార్చి 17న అంతర్రాష్ట్ర చెక్ పోస్టలను ఏర్పాటు చేశారు. చెక్‌పోస్టులతో పాటు రాపిడ్ వెహికల్ చెకింగ్ చేయాలని ఎన్నికల కమిషన్ సూచించింది. సిర్పూర్ మండలంలో మహారాష్ట్ర సరిహద్దున ఉన్న వెంకటరావుపేట్, హుడ్కిలిలలో చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. కౌటాల సీఐ సాధిక్ పాషా, ఎస్సై దీకొండ రమేష్ చెక్ పోస్టల వద్ద గట్టి బందోబస్తులు ఏర్పాటు చేశారు.

చెక్‌పోస్టు ఎత్తివేత..

మార్చి 17న అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. ఏమైందో ఎమో తెలియదు కానీ చెక్‌పోస్టును ఎత్తివేశారు. మహారాష్ట్ర సరిహద్దులోని హుడ్కిలిలోని చెక్‌పోస్టును తొలగించారు. ఈ విషయమై అధికారులను వివరణ కోరగ ఎన్నికల కమిషన్, కలెక్టర్ ఆదేశాల మేరకు ఈనెల 3న తొలగించినట్లు తెలిసింది. ఈ మార్గం ద్వారా ప్రలోబాలకు గురిచేసే వస్తువులు, డబ్బు, మద్యం రవాణ కాదనే నమ్మమో ఎమో తెలియదు కానీ అధికారులు ఈ నిర్ణయంతో ప్రజలు విస్తుండిపోయారు. ఎత్తివేయడం అయితే చెక్‌పోస్టు పెట్టుడు ఎందుకని ప్రశ్నిస్తున్నారు. మహారాష్ట్రలో ఎన్నికల నేపథ్యంలో మళ్లీ ఇక్కడ చెక్‌పోస్టు అవకాశాలున్నాయని తెలుస్తోంది. ఎలాంటి సమాచారం లేకుండా చెక్‌పోస్టులను ఎత్తివేయడం పట్ల ప్రజలు కూడా అయోమయంలో ఉన్నారు.



రాత్రి సమయంలో చెక్‌పోస్ట్ వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న సిఐ, ఎస్సై(ఫైల్)

బాల్య వివాహాలను నివారించాలి

- కలెక్టర్ వెంకటేష్ దోత్రే



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో బాల్య వివాహాల నివారణ దిశగా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. సోమవారం జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి భాస్కర్‌తో కలిసి బాల్యవివాహాల నివారణ, బాలికల రక్షణ అంశాలపై బాలికా సంరక్షణ అధికారులు, సీడీపీఓలు, సఖి సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో బాల్య వివాహాలు జరగకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని, బాల్యవివాహాల కారణంగా జరిగే అనర్థాలు, భవిష్యత్తులో వచ్చే ఆరోగ్యపరమైన సమస్యలపై బాలికల తల్లిదండ్రులకు తెలియజేస్తూ అవగాహన కల్పించాలన్నారు. బాలికల సంరక్షణ పై పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టాలని, బాల బాలికలను బాల కార్మికులుగా పనిలో నియమించుకునే యజమానులపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రతి అంగన్‌వాడి కేంద్రాలలో పిల్లల ఆరోగ్య స్థితిగతులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, బరువు, ఎత్తు, కొలతలను పరీక్షించాలని, ఎదుగుదల లోపం ఉన్న పిల్లలను గుర్తించి వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని, పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించడంతో పాటు అవసరమైన మందులను ఇవ్వాలని, ప్రతి అంగన్‌వాడి కేంద్రాల్లో సామ్‌మామ్ నిర్వహించాలని తెలిపారు. భేటీ బచావోభేటీ పడావో కార్యక్రమంలో భాగంగా జిల్లాలో చేపట్టాల్సిన చర్యలను అధికారులు సమన్వయంతో నిర్వహించాలని, అంగన్‌వాడి కేంద్రాలలో పిల్లలకు అందించే పోషకాలపై పర్యవేక్షించాలని ఆదేశించారు. అంగన్‌వాడి కేంద్రాల పరిధిలో గర్భం దాల్చిన మహిళలు తమ వివరాలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆస్పత్రులలో నమోదు చేసుకొని సమయాన్నిసారంగా అవసరమైన పరీక్షలు నిర్వహించుకునేలా అవగాహన కల్పించాలని, కేంద్రాల ద్వారా గర్భిణులకు అందించాల్సిన పోషకాహారాన్ని సకాలంలో దించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బాలల సంరక్షణ అధికారి మహేష్, సీడీపీఓలు, సఖి సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం : గోడం నగేష్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

బీజేపీతోనే దేశ అభివృద్ధి సాధ్యమవుతుందని ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి గొడం నగేష్ పునరుద్ఘాటించారు. జిల్లా కేంద్రంలోని ప్రేమల గార్డెన్‌లో నిర్వహించిన నియోజకవర్గ బూత్ స్థాయి కార్యకర్తల సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం మొత్తం బీజేపీ వైపు చూస్తుందని తమతోనే అభివృద్ధి సాధ్యమన్నారు గత పది సంవత్సరాల్లో ప్రపంచం గర్వపడేలా భారత్ అభివృద్ధి చెందిందన్నారు. మూడోసారి బీజేపీ గెలిచి మోడీ ప్రధాని కావడం ఖాయమని జోస్యం చెప్పాలరు. ఆసిఫాబాద్ నియోజకవర్గంలో బీజేపీకు చెందిన ఎమ్మెల్యే లేడని అనుకోవద్దని తాను ఎంపీగా గెలిచిన తర్వాత సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబుతో కలిసి బీజేపీ ఎమ్మెల్యే లేని లోటును భర్తీ చేస్తామని, కేంద్ర ప్రభుత్వం నుండి ప్రత్యేకంగా నిధులు తీసుకొచ్చి ఆసిఫాబాద్ నియోజకవర్గంలో దశాబ్దాలుగా పరిష్కారం కాని సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామి ఇచ్చారు. గుడిహత్నూర్ నుండి ఆసిఫాబాద్ వరకు గల రహదారిని జాతీయ రహదారిగా మార్చి అభివృద్ధి పరుస్తానని హామీ ఇచ్చారు. కేవలం పార్లమెంట్ ఎన్నికలు మాత్రమే కాకుండా రాబోవు స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు, వచ్చే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రతి కార్యకర్త పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదిలాబాద్ ఎమ్మెల్యే, పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జి పాయల శంకర్, సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు, ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షులు కొత్తపల్లి శ్రీనివాస్, పార్లమెంట్ ప్రభారి అల్జాపూర్ శ్రీనివాస్, పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమన్న, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముస్తాపురే అశోక్, సుహాసిని రెడ్డి, ఆసిఫాబాద్ నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి కోట్నాక్ విజయ్, అధికార ప్రతినిధి ఆత్మారాం నాయక్, పార్లమెంట్ కో కన్వీనర్లు మయూర్ చంద్ర, కిరణ్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ధోని శ్రీశైలం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేష్

ఉపాధి కూలీలకు పూర్తిస్థాయిలో పనులు కల్పించాలి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా జిల్లాలో చేపట్టే అభివృద్ధి పనులలో ఉపాధి కూలీల సంఖ్య పెంచి పూర్తిస్థాయిలో పనులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. సోమవారం జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సురేందర్, జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతి, కాగజ్‌నగర్ డివిజనల్ పంచాయతీ అధికారి సురేష్‌లతో కలిసి వివిధ స్థాయిల సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి పనులలో ఉపాధి హామీ కూలీల సంఖ్య పెంచి పూర్తి స్థాయిలో వారికి పని కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జాబ్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి 100 రోజుల పని కల్పించాలని, కూలీ ధరలు పెరిగినందున ప్రతి జాబ్ కార్డుదారుడు ఉపాధి హామీ పనికి వచ్చేలా పంచాయితీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. వేసవి ప్రారంభమైన నేపథ్యంలో ఉపాధి హామీ పని ప్రదేశాలలో నీడ, తాగునీరు సౌకర్యాలు కల్పించడంతో పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఉదయమే పనికి వచ్చేలా చర్యలు తీసుకోవాలని, పని ప్రదేశాలలో ఉపాధి కూలీల హాజరు శాతం పెంపొందించే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలన్నారు. ఉపాధి కూలీలకు పని నిర్వహణలో అవసరమైన పనిముట్లను అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణ కోసమే కవాతు



నవతెలంగాణ-కౌటాల

శాంతి భద్రతల పరిరక్షణ కోసమే కవాతు నిర్వహిస్తున్నట్లు సీఐ సాధిక్ పాషా అన్నారు. ఎన్నికల నేపథ్యంలో ఓటర్లకు భరోసా కల్పిస్తూ సోమవారం మండలంలోని ముత్తంపేట గ్రామంలో సీఆర్పీఎస్ బృందాలతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏండ్లు నిండిన యువతీయువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. శాంతియుత వాతావరణంలో ఓటును వినియోగించుకునేందుకు పోలీసుల ఆధ్వర్యంలో భద్రత చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రజల్లో భయం పోగొట్టాలని ఉద్దేశంతో గ్రామాల్లో కవాతు నిర్వహించామని తెలిపారు. డబ్బులు పంచిన, అనుమతి లేకుండా సమావేశాలు నిర్వహించి ప్రలోభాలకు గురిచేయడం వంటి సంఘటనలు చోటు చేసుకుంటే నేరుగా పోలీసులకు సమాచారం అందించాలన్నారు. సమాచారం అందిన 10 నిమిషాల్లో సంఘటన స్థలానికి చేరుకొని చర్యలు తీసుకుంటామన్నారు. అల్లర్లు సృష్టించిన వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఇందులో మండల ఎస్సై మధుకర్ ఉన్నారు.

తిర్యాణి నాయకులపై అసత్య ప్రచారాలు నమ్మొద్దు

- ఎమ్మెల్యే కోవ లక్ష్మీ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

తిర్యాణి మండలానికి చెందిన జడ్పీటీసీ ఆత్రం చంద్రశేఖర్, ఎంపీపీ మర్సుకోల శ్రీదేవితో పాటు ముఖ్య నాయకులు పార్టీ మారుతున్నారని జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని, అటువంటి అసత్య ప్రచారాలు నమ్మవద్దని ఎమ్మెల్యే కోవ లక్ష్మి తెలిపారు. ఆదివారం రాత్రి తన నివాసంలో తిర్యాణి మండల ముఖ్య నాయకులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని ముఖ్య నాయకులు ఎవరు కూడా పార్టీ మారుతున్నారని జరుగుతున్న అసత్య ప్రచారాన్ని ఖండిస్తున్నామని తెలిపారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కు గెలుపు కోసం ప్రతి ఒక్కరు పని చేసే విధంగా మండల నాయకులకు దిశ నిర్దేశం చేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కోవ పార్వతి, సర్పంచుల సంఘం జిల్లా మాజీ అధ్యక్షులు మడవి గుణావంత్ రావు, పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్, చుంచు శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ వెడ్మ కమల, బీఆర్ఎస్ ముఖ్య నాయకులు తాళ్ల శ్రీనివాస్ గౌడ్, ముత్యం రాజయ్య, బొమ్మగొని శంకర్ గౌడ్, మాజీ సర్పంచులు గోపాల్, సుజాత, సైతం రమేష్, నాయకులు ముత్యం బుచ్చయ్య, బ్రహ్మం, ఆకుల సత్తయ్య, వాసాల సత్యనారాయణ, వెడ్మ మొగిలి పాల్గొన్నారు.

అంబేద్కర్ సేవలు అభినందనీయం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ దేశానికి చేసిన సేవలు అభినందనీయమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ సిహెచ్ రాజు అన్నారు. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని సోమవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ముందుగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. అనంతరం ప్రిన్సిపల్ మాట్లాడుతూ ముందు తరాలను దృష్టిలో పెట్టుకొని ఆయన రచించిన రాజ్యాంగం వల్లే నేడు బలహీనవర్గాలు అన్ని రంగాలలో రాణించగలుగుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రాం అధికారి తూడూరు దత్తాత్రేయతో పాటు విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.



నేడు జిల్లాకు కేటీఆర్ రాక

- ఏర్పాట్లు పరిశీలించిన జోగురామన్న

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా రాష్ట్రంలో తొలి ప్రచారం ఆదిలాబాద్ నుంచే ప్రారంభం అవుతుందని, దీనికి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రానున్నారని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. నేడు పట్టణంలోని గాయత్రి గార్డెన్‌లో నిర్వహించే పార్లమెంటరీ బూత్ స్థాయి కార్యకర్తల సమావేశానికి కేటీఆర్ అతిథిగా హాజరు కానున్నారు. సోమవారం ఏర్పాట్లను ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కుతో కలిసి జోగురామన్న పరిశీలించారు. ఈ సందర్భంగా రామన్న మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ప్రచారానికి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదిలాబాద్ రానున్నారని తెలిపారు. మంగళవారం గాయత్రి గార్డెల్లో ఉదయం 10.30గంటలకు సభ ప్రారంభం అవుతుందని, బూత్ కార్యకర్తలు సకాలంలో హాజరు కావాలని కోరారు. ఇప్పటికే పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజవకర్గాలకు సమన్వయ కమిటీలను వేశామన్నారు. ఈ కార్యక్రమంలో సాజిదొద్దీన్, పండ్ల శ్రీను, జోగు మహేందర్ పాల్గొన్నారు.

రిటైర్మెంట్ బెన్ఫిట్స్‌పై జీఓను ఉపసంహరించుకోవాలి

నవతెలంగాణ-జైపూర్

అంగన్‌వాడీ టీచర్స్‌తో పాటు హెల్పర్స్‌కు సంబంధించి రిటైర్మెట్ బెనిఫిట్స్‌పై రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీఓను తక్షణమే ఉపసంహరించుకోవాలని సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడి టీచర్లు, హెల్పర్లు డిమాండ్ చేశారు. ఈ విషయమై చెన్నూర్‌లో సోమవారం ఐసీడీఎస్ సీడీపీఓ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. గత ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం టీచర్స్‌కు రూ.2లక్షలు, హెల్పర్లకు రూ.లక్ష రూపాయలు, 60 సంవత్సరాలు దాటిన వారికి వీడీఎస్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా జీఓ జారీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు నగేష్, అంగన్‌వాడి టీచర్లు, హెల్పర్లు ప్రవీణ, పద్మావతి, శారద, మణిమాల, భారతి, లలిత, సురేఖ, సావిత్రి, రాజుబాయి, హేమలత, సుగుణ, ఈశ్వరి, సునిత పాల్గొన్నారు.

వడదెబ్బకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన



నవతెలంగాణ-వేమనపల్లి

వేసవికాలం నేపథ్యంలో రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రత వల్ల గ్రామాలలో ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జిల్లా వైద్యాధికారి సుబ్బారాయుడు అవగాహన కల్పించారు. సోమవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి సిబ్బందికి అవగాహన కల్పించారు. గ్రామాలను సందర్శించి వడదెబ్బ బారిన పడకుండా ప్రజలను చైతన్య పరచాలని, ఎండాకాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. తెల్లటి దుస్తులు ధరించాలని, అత్యవసర సమయంలో బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగులు పట్టుకొని వెళ్లాలని సూచించారు. డిహైడ్రేషన్ బారిన పడకుండా పండ్ల రసాలు తాగాలని తెలిపారు. ఆయన వెంట డాక్టర్ రాజేష్, వైద్య సిబ్బంది ఉన్నారు.

అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్ విడుదల

నవతెలంగాణ-జన్నారం

ఏప్రిల్ 14 నుంచి 20 వరకు మండల కేంద్రంలో అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహించనున్నట్లు ఫైర్‌స్టేషన్ ఎస్సై సంతోష్ తెలిపారు. సోమవారం అగ్నిమాపక వారోత్సవాలకు సంబంధించిన వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవిలో చిన్నపిల్లలకు లైటర్, అగ్గిపెట్టెల లాంటివి ఇవ్వకూడదన్నారు. నిప్పు పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

కాంగ్రెస్‌లో భారీ చేరికలు

నవతెలంగాణ-జైపూర్

మండలంలోని బెజ్జాల, టేకుమట్ల, ముదిగుంట గ్రామాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. మండలానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుల ఆధ్వర్యంలో సోమవారం కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పుకున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను అత్యధిక మెజార్టీతో గెలిపిస్తామని హామీ ఇచ్చారు. గ్రామాలకు గ్రామాలుగా స్వచ్ఛందంగా కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న వారందరికి పార్టీ కండువాలు కప్పి ఎమ్మెల్యే వివేక్ సాదరంగా ఆహ్వానించారు.

జన్నారం : మండలంలోని సోనాపూర్‌తండా, బంగారుతండా గ్రామపంచాయతీలకు చెందిన బిజెపి, బీఆర్ఎస్ పార్టీల నుండి నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముజాఫర్ అలీ ఖాన్, ప్రధాన కార్యదర్శి మేకల మాణిక్యం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఉట్నూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మొత్తం శంకరయ్య పాల్గొన్నారు.

మెజీషియన్ సాయికృష్ణకు నంది పురస్కారం

నవతెలంగాణ-మందమర్రి

మందమర్రికి చెందిన మెజీషియన్ జాతీయ కళారత్న అవార్డు గ్రహీత వడేపెల్లి సాయికృష్ణ స్వర్ణనంది పురస్కారాన్ని అందుకున్నారు. ఆదర్శ కళానిలయం ఆధ్వర్యంలో వ్యవస్థాపక అధ్యక్షుడు చేరాల ప్రకాష్ లలిత దంపతుల నిర్వహణలో హైదరాబాద్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్ భవనంలోని డాక్టర్ దేవులపల్లి రామానుజారావు కళామందిరంలో ఆదివారం రాత్రి నిర్వహించిన ఉగాది స్వర్ణనంది పురస్కారాల్లో సాయికృష్ణ అవార్డు అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుండి వివిధ రంగాలలో విశేష కృషి చేసిన 42 వ్యక్తులను గుర్తించి ఈ పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సరస్వతీ ఉపాసకులు దైవజ్ఞ శర్మ, ప్రముఖ సినీ నటులు మాణిక్, సినిమా, టీవీ నటులు రాజేందర్, విజయ భాస్కర్, ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఓఎస్‌డి డాక్టర్ ఎం.ప్రభాకర్ పాల్గొన్నారు.

ఆర్టీసీ ద్వారా భద్రాద్రి శ్రీరాముల తలంబ్రాలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

భద్రాచలం శ్రీరాములవారి కళ్యాణ మహోత్సవానికి వెళ్లని వారి భక్తుల సౌకర్యార్థం టిఎస్‌ఆర్టిసి, దేవాదాయ శాఖ వారి సహకారంతో శ్రీరాములవారి తలంబ్రాలను అందజేయడం జరుగుతుందని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. భక్తులు కార్గో పార్సెల్ కేంద్రాల్లో బుక్ చేసుకోవాలన్నారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీతారామచంద్ర స్వామి కళ్యాణ తలంబ్రాలు పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

పాఠశాలల అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

- మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్



నవతెలంగాణ-నస్పూర్

వేసవి సెలవులు ఉన్నందున వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం అయ్యేలోగా ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన అభివృద్ధి పనులను చేపట్టి త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి. రాహుల్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.యాదయ్యతో కలిసి మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు, మెప్మా, ఎపిఎం, ఇంజనీరింగ్ విభాగం అధికారులకు అభివృద్ధి పనుల నిర్వహణపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలల యాజమాన్య కమిటీలకు రూపాంతరంగా అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు ఏర్పాటు చేయడం జరిగిందని, అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో కనీస వసతులు కల్పించడం లక్ష్యంగా నిర్దేశించడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో అత్యవసర, నిర్వహణ పనులలో భాగంగా ప్రాథమిక, మౌళిక సదుపాయాల బలోపేతం, బాలికల మరుగుదొడ్ల నిర్మాణం, తాగునీటి సౌకర్యాలు కల్పించడం, చిన్న, పెద్ద మరమ్మత్తులను చేపట్టడం, ఇప్పటికే ఉన్న, పనిచేయని మూత్రశాలల పున:రుద్ధరణ, నిర్వహణ, తరగతి గదుల విద్యుదీకరణ, పాఠశాల ఆవరణలో పారిశుధ్య నిర్వహణ, విద్యుత్ బిల్లులను తగ్గించేందుకు సోలార్ ప్యానళ్ల ఏర్పాట్లు, పాఠశాల మొత్తం నిర్వహణ, ఏకరూప దుస్తుల తయారు తదితర సౌకర్యాల కల్పన లక్ష్యంగా అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ పని చేస్తుందని తెలిపారు. ప్రత్యేక ఆడిట్ జరిగిన సమయంలో ప్రతి బిల్లును పరిశీలించడం జరుగుతుందని, ఈ క్రమంలో పనులకు సంబంధించిన బిల్లులను కచ్చితంగా నమోదు చేయాలని, రిజిస్టర్ నిర్వహించాలని తెలిపారు. పాఠశాలలు ప్రారంభం అయిన తరువాత మధ్యాహ్న భోజన పథకం, ఉపాధ్యాయులు హాజరు, పనితీరు పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీకి చేసిన పనుల విలువపై పన్నులు మినహా నిబంధనల మేరకు ప్రోత్సాహకం అందించడం జరుగుతుందని, పనుల సంబంధిత రికార్డులను పారదర్శకంగా నిర్వహించాలని తెలిపారు. పాఠశాల పరిధిలో బడి బయట పిల్లలందరినీ నమోదు చేసి వారు తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఆయా పాఠశాలలకు మంజూరైన నిధులను సమర్థవంతంగా వినియోగించేలా పర్యవేక్షించాలని, ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలలో పూర్తి స్థాయి వసతులు కల్పించి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

రాజ్యాంగాన్ని మార్చుతామంటున్న బీజేపీకి బుద్ధి చెప్పాలి

- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్



నవతెలంగాణ-నస్పూర్

పార్లమెంట్ ఎన్నికలలో 400 సీట్లు గెలిచి రాజ్యాంగాన్ని మార్చుతామంటున్న మతోన్మాద బిజెపిని ఓడించి బుద్ధి చెప్పాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్, సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి కార్మికులకు పిలుపు నిచ్చారు. శ్రీరాంపూర్ ఏరియాలోని సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కుల, మత బేధాలు లేకుండా మానవ హక్కుల కోసం, అంటరానితనానికి వ్యతిరేకంగా పోరాడారని తెలిపారు. అంబేద్కర్ స్ఫూర్తితో కార్మిక, ప్రజా వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్న బిజెపిని గద్దె దించడానికి కార్మికులు ఐక్యంగా ఉండాలన్నారు. బీజేపీని ఓడించి భారత రాజ్యాంగాన్ని, ప్రభుత్వ సంస్థలను, బొగ్గు పరిశ్రమలను కార్మికుల హక్కులను పరిరక్షించుకోవాలని పేర్కొన్నారు. అనంతరం ఆర్కె-5 గని ఫిట్ కమిటీని ఎన్నుకున్నారు. ఫిట్ కమిటీ వైస్ ప్రెసిడెంట్‌గా మిడివెల్లి శ్రీనివాస్‌ను ప్రతిపాదించగా కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు.

ఫిట్ కార్యదర్శిగా ఇప్ప నరేష్, ఫిట్ అడ్వైజర్‌గా చిగురి లక్ష్మణ్, షిఫ్ట్ ఇన్చార్జిలుగా ఎ-రిలే, బట్టు సురేందర్, బి-రిలే దామెర తిరుపతి, సి-రిలే పోతు వెంకటేష్, డి-రిలే చిలువటకారి తిరుపతి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి అంబాల శ్రీనివాస్, కోశాధికారి కస్తూరి చంద్రశేఖర్, ఆర్గనైజర్ కేసిరెడ్డి శ్రీనివాస్ పాల్గొన్నారు.

తదుపరి పంట సాగుకు జాగ్రత్తలు తీసుకోవాలి



నవతెలంగాణ-నస్పూర్

వరి పంట దిగుబడిని అంచనా వేసుకొని తదుపరి పంట సాగుకు తగిన జాగ్రత్తలు తీసుకొని అధిక దిగుబడికి రైతులు కృషి చేయాలని అర్థగణాంక శాఖ సంయుక్త సంచాలకులు పి.రవీంద్రారెడ్డి అన్నారు. సోమవారం హాజీపూర్ మండలం పెద్దంపేట గ్రామంలో బెంబడి గురువయ్య సాగు చేసిన వరి పంటను ముఖ్య ప్రణాళిక అధికారి జి.సత్యం, జిల్లా వ్యవసాయ అధికారి జి.కల్పన, ఉప గణాంక అధికారి డి. శ్రీకాంత్‌తో కలిసి సందర్శించారు. పంట దిగుబడిని అంచనా వేశారు ఈ సందర్భంగా సంయుక్త సంచాలకులు మాట్లాడుతూ పంట పొలంలో 5 మీటర్ల పొడవు, 5 మీటర్ల వెడల్పు విస్తీర్ణంలో పంట కోత ప్రయోగం జరిపి 19.855 కిలోల దిగుబడి తీయడం జరిగిందని తెలిపారు. రైతులు పంట సాగులో మెళకువలు పాటించి అధిక దిగుబడి సాధించేలా కృషి చేయాలని, వివరాలు, సలహాల కొరకు వ్యవసాయ, విస్తరణ అధికారులను సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎం.రజిత, ఉప గణాంక అధికారి ఎస్.పాపయ్య, మండల ప్రణాళిక, గణాంక అధికారి పి.రమేష్, వ్యవసాయ విస్తరణ అధికారి ఎస్.కనకరాజు పాల్గొన్నారు.

అన్ని వర్గాల అభ్యున్నతి బీఆర్ఎస్‌తోనే సాధ్యం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అన్ని వర్గాల అభ్యున్నతి కేవలం బీఆర్ఎస్‌తోనే సాధ్యమని మాజీ మంత్రి జోగు రామన్న స్పష్టం చేశారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రధాన బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఆత్రం సక్కు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ముమ్మర ప్రచారం చేపడుతున్నారు. సోమవారం ఉదయం మార్నింగ్ వాకర్స్‌ను కలిసి మాజీ మంత్రి జోగు రామన్న, ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కులు ఎన్నికల ప్రచారం చేపట్టారు. నడక సాధకులను కలిసి వారితో సరదాగా ముచ్చటించారు. బీఆర్ఎస్ హయంలో జరిగిన అభివృద్ధిని వివరిస్తూ కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని విన్నవించారు. గత ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. వారి వెంట మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్ ప్రచారాన్ని కొనసాగించారు. అలాగే స్థానిక సాత్నాల బస్‌స్టాండ్ సమీపంలోని చమన్ వాలే బాబా దర్గాలో చాదర్ సమర్పించారు. మత పెద్దల సమక్షంలో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. ఈ సందర్భంగా జోగు రామన్న మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో అనేక సంక్షేమ పథకాలను అమలు చేసి సమగ్ర అభివృద్ధికి పాటు పడిన విషయాన్నీ గుర్తు చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో బీజేపీ, కాంగ్రెస్‌లు పూర్తిగా విఫలమయ్యాయని దుయ్యబట్టారు. సీఎం తన అధికార దాహంతో రాజ్యాంగకర్త అంబేద్కర్‌ను విస్మరించడం తన అహంకారానికి నిదర్శనం అన్నారు. అంబేద్కర్ పట్ల ఇంత అవమానంగా వ్యవహరించిన సీఎం రేవంత్‌రెడ్డి యావత్ సమాజానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్ సారథ్యంలో తెలంగాణ అభివృద్ధి పథంలో దూసుకెళ్లిందని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని వర్గాల అభ్యున్నతికి విశేష కృషి చేసిందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అజయ్, ఇజ్జగిరి నారాయణ, రోకండ్ల రమేష్, అశోక్, స్వామి, లింగారెడ్డి పాల్గొన్నారు.



ఏఆర్ఎస్ కళాశాలలో జాబ్‌మేళా

నవతెలంగాణ-జన్నారం

మండల కేంద్రంలోని ఏఆర్ఎస్ డిగ్రీ కళాశాలలో సోమవారం నిర్వహించిన జాబ్‌మేళాకు 200 మంది హాజరయ్యారు. వీరిలో 11 మంది ఉద్యోగానికి ఎంపికయ్యారని కళాశాల కరస్పాండెంట్ ముత్యం సతీష్ తెలిపారు. ఏఎస్ఎన్ నెట్వర్క్ సొల్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించామన్నారు. ఈ సంస్థ ద్వారా ఎంతో మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్ మహేష్, రఘు పాల్గొన్నారు.

అనుమతిలేని వెంచర్, షెడ్ తొలగింపు

నవతెలంగాణ-నస్పూర్

అనుమతులు లేకుండా నిర్మించిన వెంచర్, షెడ్‌ను డిటిఎఫ్(డిస్ట్రిక్ట్ టాస్క్ ఫోర్స్) టీం అధికారులు మున్సిపల్ కమిషనర్ సతీష్, తహసీల్దార్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం తొలగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎలాంటి అనుమతి లేకుండా నస్పూర్ శివారులోని సర్వే నెంబర్ 64లో అక్రమంగా నిర్మించిన షెడ్, వెంచర్‌ను తొలగించామని, ఎవరైన ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు చేపడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఉచిత అంబలి పంపిణీ

నవతెలంగాణ-కాసిపేట

పేదలకు సాయం అందించడమే కొక్కిరాల కుటుంబం లక్ష్యమని కాంగ్రెస్ మండల అధ్యక్షులు వేముల కృష్ణ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని దేవాపూర్‌లో కొక్కిరాల రఘుపతిరావు జ్ఞాపకార్థం ఉచిత అంబలి పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొక్కిరాల రఘుపతిరావు కుటుంబం పేదలకు సేవ చేయడమే లక్ష్యంగా పని చేస్తోందని తెలిపారు. వేసవికాలం దృష్టిలో పెట్టుకొని ఉచిత అంబలి పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మారావుపేట ఎంపీటీసీ పార్వతి మల్లేష్, దేవాపూర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుడుంబా విక్రయదారుగా అనుమానిస్తున్న వ్యక్తి బైండోవర్

నవతెలంగాణ-జైపూర్

అక్రమంగా గుడుంబా విక్రయిస్తున్నట్లుగా గుర్తించిన జుమిడి మహేందర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు మంచిర్యాల డివిజన్ ఎక్సైజ్ ఎస్సై వెంకటరమణ తెలిపారు. సోమవారం ఎక్సైజ్ సిబ్బంది గోపాల్‌పూర్ గ్రామంలో తనిఖీలు చేపట్టగా అనుమానిత జుమిడి మహేందర్‌ను అదుపులోకి తీసుకుని తహసీల్దార్ వనజారెడ్డి ఎదుట బైండోవర్ చేసినట్లు తెలిపారు. అక్రమంగా గుడుంబా తరలించినా, విక్రయించినా రూ.1లక్ష జరిమానా విధించడంతో పాటు జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

అటవీ ప్రాంతంలో కార్చిచ్చు

నవతెలంగాణ-జైపూర్

మండలంలోని ఇందారం శివారు అటవీ ప్రాంతంలో ఆదివారం అర్ధ రాత్రి అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. రాజీవ్ రహదారి ఆనుకుని మంటలు చెలరేగిన తీరును స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న ప్లాంటేషన్ మేనేజర్ సురేష్ కుమార్ అటవీ అధికారులతో పాటు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. స్థానికులతో పాటు అటవీ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని మంటల వ్యాప్తిని అరికట్టి పూర్తిగా చల్లార్చినట్లు తెలిపారు. సామాజిక బాధ్యతగా భావించిన స్థానికులు అందించిన సమాచారం మేరకు అటవీ అధికారులు, అగ్నిమాపక సిబ్బంది సమిష్టిగా శ్రమించి అటవీలో జరిగిన అగ్ని ప్రమాదాన్ని అరికట్టడం జరిగిందని సురేష్ కుమార్ తెలిపారు. అగ్ని ప్రమాదం మానవ తప్పిదంతోనే జరిగి ఉంటుందని అభిప్రాయపడ్డారు. రహదారి మీదుగా ప్రయాణిస్తున్న వారు బీడీ, సిగరేట్ తాగి నిర్లక్ష్యంగా పడవేడంతో అటవీ ప్రాంతంలో అగ్గి రాజేసుకుందని తెలిపారు. అగ్ని ప్రమాదాల నుండి అడవులను కాపాడుకోవల్సిన అవసరాన్ని ప్రతి ఒక్కరు బాధ్యతగా స్వీకరించాలని, అడవులు తగలబడటం ద్వారా జరిగే నష్టాన్ని అంచనా వేయలేమని పేర్కొన్నారు.

వ్యాపారుల ఇంట్లో పోలీసుల సోదాలు

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండల కేంద్రంలోని జైస్వాల్ రామ్ అవతార్, చిట్టీల వ్యాపారి సంతోష్‌ల ఇంట్లో స్థానిక ఎస్సై దుబ్బాక సునీల్ ఆధ్వర్యంలో సోమవారం తనిఖీలు నిర్వహించారు. పలు డాక్యుమెంట్లను, ప్రామిసరీ నోట్లపై ఆరా తీశారు. మండలంలో గత కొన్ని రోజుల నుంచి వడ్డీ వ్యాపారులు ప్రామిసరీ నోట్లు, బాండ్ పేపర్లపై ఇల్లిగల్ వ్యాపారం చేస్తున్నట్టు పోలీసుల ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లింది. దీంతో స్పందించిన పోలీసులు వడ్డీ వ్యాపారుల ఇంట్లో సోదాలు చేశారు. ఇదే గాక ఒంగోల్, తమిళనాడు, గుంటూరుకు చెందిన కొందరు అక్రమార్కులు మండల కేంద్రంతో పాటు ఏజెన్సీలోని మారుమూల గిరిజన పల్లెల్లో అధిక వడ్డీకు డబ్బులు ఇస్తూ, అనధికార ధందాను చేస్తున్నారు. వారం వారం గ్రామాల్లోకి వస్తూ వడ్డీతో సహా ముక్కు పిండి అమాయక ఆదివాసుల నుంచి వసూలు చేస్తున్నారు. వీరిపై సైతం పోలీసులు కొరడా ఝులిపించాలని గిరిజన నాయకులు కోరుతున్నారు.

బీఆర్ఎస్‌కు షాక్

నవతెలంగాణ-నిర్మల్

బీఆర్ఎస్‌కు పెద్ద షాక్ తగిలింది. ఇటీవలనే పలువురు జిల్లా నుంచి కాంగ్రెస్‌లో ముఖ్య నాయకులు చేరారు. కాగా సోమవారం నిర్మల్ మున్సిపల్ చైర్మెన్‌తో పాటు పలువురు కౌన్సిలర్లు సైతం కాంగ్రెస్‌లో చేరారు. నిర్మల్ మున్సిపాలిటీకి చెందిన బీఆర్ఎస్ అభ్యర్థిగా గతంలో పోటీ చేసి గెలిచిన గండ్రత్ ఈశ్వర్ మున్సిపల్ చైర్మెన్‌గా కొనసాగుతూ వస్తున్నారు. కాగా ఇటీవల కాలంగా ఆ పార్టీకి కార్యకలాపాలకు దూరంగా ఉంటూ వస్తున్నారు. దీంతోపాటు ఇటీవలనే 13 మంది కౌన్సిలర్లతో బీఆర్ఎస్‌కు రాజీనామా చేశారు. తీరా సోమవారం ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, నిర్మల్ జిల్లా డీసీసీ అధ్యక్షులు శ్రీహరి రావు ఆధ్వర్యంలో హైదరాబాదులో సీఎం రేవంత్ రెడ్డి నివాసంలో కాంగ్రెస్‌లో చేరారు. వీరికి సీఎం రేవంత్‌రెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. దీంతో నిర్మల్ రాజకీయాల్లోను మార్పులు రానున్నాయి. అలాగే బీఆర్ఎస్‌కు పెద్ద షాక్ తగలగా దిగమింగని పరిస్థితి నెలకొంది. పార్టీలో చేరిన వారిని చిన్నూ, మాజీ మున్సిపల్ చైర్మెన్ అప్పాల గణేష్ చక్రవర్తి, సయ్యద్ అర్జుమంద్ అలీ, నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా శ్రీ సీతారాముల బ్రహ్మోత్సవాలు

నవతెలంగాణ-దస్తురాబాద్

మండలంలోని రేవోజిపేట్ గ్రామంలోని శ్రీసీతారాముల బ్రహ్మోత్సవాలు శ్రీ వద్దిపర్తి వంశీ కృష్ణమాచార్యుల ఆధ్వర్యంలో ఐదు రోజుల పాటు ఘనంగా నిర్వహించనున్నట్టు తెలిపారు. ఇందులో భాగంగా 14వ తేదీ నుంచి 19వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలను కన్నుల పండుగగా నిర్వహించనున్నారు. సోమవారం స్వామివారి పల్లకి సేవ, యాగశాల ప్రారంభోత్సవం వంటి కార్యక్రమాలను గ్రామస్తుల చేతుల మీదుగా నిర్వహించారు. స్వామి వారి ఏకాంత సేవతో బ్రహ్మోత్సవాలు ముగియ నున్నట్టు ఆలయ అర్చకులు తెలిపారు.

నవతెలంగాణ
నమస్తే తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
మంగళవారం | ఏప్రిల్ 16, 2024 | www.navatelangana.com

మొక్కజొన్న సంచులులారీ బోల్తా

నవతెలంగాణ-కుభీర్

మొక్క జొన్న లోడ్‌తో వెళ్తున్న లారీ అదుపు తప్పి బోల్తా పడింది. మండలంలోని అంతర్రాష్ట్ర సరిహద్దును కలిపే కుభీర్, పార్డి(కె) గ్రామాల మధ్యన సోమవారం మండల కేంద్రం నుంచి



మహారాష్ట్రలోని నాందేడ్ వైపుకు మొక్క జొన్న సంచులు తీసుకువెళ్తున్న లారీ అదుపు తప్పి లోయలో బోల్తా పడింది. దీంతో లారీ డ్రైవర్‌కు స్వల్ప గాయాలు అయ్యాయి. విషయం తెలుసుకున్న యజమాని మొక్క బోల్తా పడిన లారీ నుంచి జొన్న బస్తాల నుంచి మరో వాహనంలోకి వేసి తరలించే ఏర్పాట్లు చేస్తున్నారు.

పంచాయతీని తనిఖీ చేసిన డీపీఓ

నవతెలంగాణ-ముధోల్



ముధోల్ మెజర్ గ్రామపంచాయతీని జిల్లా పంచాయతీ అధికారి(డీపీఓ) శ్రీనివాస్ సోమవారం సాయంత్రం తనిఖీ చేశారు. గ్రామంలో పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. వేసవిలో తాగునీటిని సక్రమంగా అందించాలని అన్నారు. గ్రామాల్లో తాగు నీటి సమస్యల గురించి తెలుసుకుంటు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. పారిశుద్ధ్య కార్మికులు తమకు మూడు నెలల నుండి వేతనాలు రాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని డీపీఓకు విన్నవించారు. త్వరలో వేతనాలు చెల్లించేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట డీఎల్పీఓ మోజం హుస్సేన్, ఇన్‌చార్జి ఈఓ అనుష ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం చెందిన ఘటన ఆదిలాబాద్ జిల్లాలో చోటుచేసుకుంది. మావల ఎస్ఐ విష్ణువర్ధన్ వివరాల ప్రకారం.. ఖానాపూర్ మండలం గోసం పల్లి గ్రామానికి చెందిన మోతె లచ్చన్న (53) తన వృత్తి ధర్మంలో భాగంగా పలువురుతో కలిసి ఆదిలాబాద్ నుండి ఒరిస్సా రాష్ట్రానికి వెళ్లడానికి సిద్ధమయ్యారు. ఈ క్రమంలో ఖానాపూర్ నుండి ద్విచక్ర వాహనంపై వస్తున్న లచ్చన్న మావల బైపాస్ వద్ద రోడ్డు క్రాస్ అవుతున్న సమయంలో అటుగా వెళ్తున్న కంటైనర్ ఢీకొట్టింది. ఈ ఘటనలో ద్విచక్ర వాహనదారుడు లచ్చన్నకు తీవ్రగాయాలు కాగా అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఈ విషయం తెలుసుకున్న మావల పోలీసులు వెంటనే ఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు. అంబులెన్స్ సహాయంతో మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు. కాగా కంటైనర్ డ్రైవర్ పరారీలో ఉన్నట్లు తెలిపారు.

బీఆర్ఎస్ అభ్యర్థి తరపున ప్రచారం



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు తరపున ఆ పార్టీ నాయకులు ప్రచారం నిర్వహించారు. సోమవారం మండలంలోని లోహార, ఖండాల, కొత్తగూడెం, సాలేగూడ, అసోద, పూనాగుడ గ్రామాలలో మాజీ మార్కెట్ చైర్మన్ కుమ్ర రాజు, దుర్వ రాంచందర్ ఇంటింటికి తిరిగి బీఆర్ఎస్ చేసిన అభివృద్ధిని వివరిస్తు ఓట్లను అభ్యర్థించారు. ఈకార్యక్రమంలో నాయకులు సిడం లక్ష్మణ్, మాజీ సర్పంచ్ మారప రాంచందర్, సొసైటీ డైరెక్టర్ మెస్రం పరమేశ్వర్ పాల్గొన్నారు.

అపూర్వం మహా సమ్మేళనం



నవతెలంగాణ-రెబ్బెన

బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి ఇంక్లైన్, గోలేటి వన్-ఏ వివిధ భూగర్భగనులలో 1977 నుండి 2024 సంవత్సరం వరకు పని చేసిన సింగరేణి ఉద్యోగులు సోమవారం సమేళ్లనం నిర్వహించారు. ఉద్యోగంలో చేసిన పనులు, ఒత్తిళ్లు తదితర వాటిని గుర్తుతెచ్చుకున్నారు. ఒకరినోకరు పలకరించుకుంటూ పని స్థలాలలో చేసిన జ్ఞాపకాలను నెమరుకొంటూ సెల్ఫీలు దిగారు. ఈ సమ్మేళనంలో సుమారు 300 మంది ఉన్నారు. 75 మంది హాజరయ్యారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

నవతెలంగాణ-బేల

మండలంలోని భేధోడా గ్రామ శివారులో పేకాట ఆడుతున్నరన్న సమాచారంతో పోలీసులు దాడులు నిర్వహించారు. ఇందులో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను పట్టుకున్నారు. వీరి వద్ద నుంచి రూ.30540 నగదును స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై రాధిక తెలిపారు.

18 నుంచి గోలేటిలో ఫుట్‌బాల్ టోర్నమెంట్

నవతెలంగాణ-రెబ్బెన

ఈనెల 18 నుంచి గోలేటిలోని శ్రీ భీమన్న స్టేడియంలో వేణుగోపాల్ మెమోరియల్ ఇన్విటేషన్ ఫుట్‌బాల్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్టు సింగరేణి అధికారులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో తెలంగాణతో పాటు మహారాష్ట్రకు చెందిన 12 జట్లు పాల్గొంటాయని తెలిపారు. రెఫరీలుగా తెలంగాణ ఫుట్‌బాల్ ఫెడరేషన్ హైదరాబాద్ నేషనల్ క్వాలిఫైడ్ వారు వ్యవహరిస్తారని పేర్కొన్నారు. ఈ టోర్నమెంట్ నాకౌట్ పద్ధతిలో మ్యాచులుంటాయన్నారు. టోర్నమెంట్ విన్నర్ టీంకు రూ.50 వేలు, రన్నర్ టీంకు క్యాష్ ప్రైస్, ప్రతి మ్యాచ్‌కు మాన్ ఆఫ్ ది మ్యాచ్ మెమొంటో అందజేస్తామన్నారు. 12 జట్లకు సింగరేణి యాజమాన్యం మూడు రోజుల పాటు భోజనం, అల్పాహారంతో పాటు వసతి కల్పింస్తామన్నారు.

ప్రమాదవశాత్తు కిందపడి వ్యక్తి మృతి

నవతెలంగాణ-బోథ్

మండలంలోని కనుగుట్ట గ్రామానికి చెందిన రాజారావుకార్ రాజు(45) అనే వ్యక్తి ఛాతీలో నొప్పి రావడంతో సోమవారం ఒక్కసారిగా కిందపడిపోయాడు. దీంతో ఆయనకు తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. అలాగే తల్లి రాధాబాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాము తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-రెబ్బెన

విద్యుత్ మరమ్మత్తుల కారణంగా మండలంలోని చిల్కమారిగూడ, రాజారాం, నారాయణపూర్, కొమరవెల్లి, కిస్తాపూర్, జక్కులపల్లి,పైకాజిగూడ గల గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఉంటుందని అధికారులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 6 గంటలత నుంచి 11 గంటల వరకు సరఫరా ఉండదని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించగలరని కోరారు.

బిల్లుల చెల్లింపులో జాప్యం

- పాఠశాల బడికి తాళం
- డీఈఓ, కో ఆర్డినేటర్ హామీతో తాళం తీసిన కాంట్రాక్టర్



పాఠశాలకు తాళం వేయడంతో బయట వేచి చూస్తున్న విద్యార్థులు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

పాఠశాల భవన నిర్మాణం పూర్తయ్యినా తనకు రావాల్సిన బిల్లులు రాకపోవడంతో ఒక కాంట్రాక్టర్ ఏకంగా పాఠశాల ప్రధాన ద్వారానికి తాళం వేసి నిరసన తెలిపిన సంఘటన కాగజ్‌నగర్ పట్టణంలో చోటు చేసుకుంది. రూ. 97 లక్షల బిల్లు రావాల్సి ఉండగా, సదరు కాంట్రాక్టర్ ఉదయం 07-45 నిమిషాల నుండి 09-15 నిమిషాల వరకు పాఠశాల ప్రధాన ద్వారానికి తాళం వేశాడు. దీనితో ఉదయం పాఠశాలకు వచ్చిన విద్యార్థులు పాఠశాలకు తాళం వేసి ఉండడంతో బయటే వేచి చూశారు. సోమవారం నుండే ఎస్ఎ-2 పరీక్షలు ప్రారంభం కానుండగా ఈ ఘటనతో విద్యార్థులు ఆందోళనకు గురయ్యారు. కాగజ్‌నగర్ పట్టణం పెట్రోల్‌పంపులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు మన ఊరు-మన బడి కింద నిధులు మంజూరయ్యాయి. ఇందులో ప్రాథమిక పాఠశాలకు రూ. 49 లక్షలు, జెడ్పీ పాఠశాలకు రూ. 49 లక్షలు మంజూరు కాగా, అదనపు తరగతి గదుల నిర్మాణానికి డీఎంఎఫ్‌టీ కింద మరో రూ. 30 లక్షలు మంజూరయ్యాయి. ఈ పనులన్నీ ఏడాది క్రితమే పూర్తి కాగా సదరు కాంట్రాక్టర్‌కు గతేడాది జూన్‌లో రూ. 29 లక్షల బిల్లు చెల్లించారు. ఇంకా కాంట్రాక్టర్‌కు రూ. 97 లక్షలు రావాల్సి ఉంది. బిల్లుల కోసం అధికారుల చుట్టూ తిరిగితిరిగి వేసారిపోయిన కాంట్రాక్టర్ సోమవారం ఉదయమే పాఠశాలకు వచ్చి ప్రధాన గేటుకు తాళం వేసి నిరసన తెలిపాడు. గంటన్నర అనంతరం కాంట్రాక్టర్‌కు డీఈఓ అశోక్, మన ఊరు మన బడి కో ఆర్డినేటర్ భరత్‌కుమార్‌లు హామీ ఇవ్వడంతో గేటుకు వేసిన తాళాన్ని కాంట్రాక్టర్ తీశాడు. త్వరలోనే బిల్లుల చెల్లింపులు జరిగేలా చూస్తానని అధికారులు హామీ ఇచ్చినట్లు సదరు కాంట్రాక్టర్ హబీబ్ తెలిపాడు. ఒకటి నుండి తొమ్మిదో తరగతి విద్యార్థులకు సోమవారం నుండే ఎస్ఎ-2 పరీక్షలు ప్రారంభం కానున్న సమయంలో కాంట్రాక్టర్ పాఠశాల గేటుకు తాళం వేసి నిరసన తెలుపడం చర్చనీయాంశంగా మారింది.

అధికారుల విచారణ

కాగా ఈ పాఠశాలను మధ్యాహ్నం కాగజ్‌నగర్ ఆర్డీఓ సురేష్‌కుమార్, తహసీల్దార్ కిరణ్, సీఐ శంకరయ్యలు సందర్శించారు. ప్రధానోపాధ్యాయులు వెంకటరాజయ్యను కలిసి విచారించారు. సదరు కాంట్రాక్టర్‌కు ఎంత మేర బిల్లులు రావాలి, భవిష్యత్తులో మళ్లీ ఇలాంటి సంఘటన పునరావృతమయ్యే అవకాశం ఉందా అని తెలుసుకున్నారు. ఎలాంటి ఇబ్బందులున్న తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

కోతుల బెడద నుంచి ప్రజలకు రక్షణ కల్పించాలి

- నిర్మల్ కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

నవతెలంగాణ-నిర్మల్

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో కోతుల బెడద నుంచి ప్రజలకు రక్షణ కల్పించాలని నిర్మల్ కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కోతుల దాడుల నుంచి ప్రజలకు రక్షణ కల్పించే అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిర్మల్, ఖానాపూర్, బైంసా మున్సిపాలిటీలలో కోతుల వల్ల ప్రజలు తీవ్ర సమస్యలు ఎదుర్కుటున్నారని అన్నారు. వాటి నియంత్రణకు మున్సిపల్, అటవీ, వైద్యశాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి వాటి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. కోతులను పట్టుకునే బృందాలను ఏర్పాటు చేసి, వాటిని పునరావాస కేంద్రాలకు తరలించి నియంత్రణకు శస్త్రచికిత్సలు నిర్వహించాలన్నారు. అనంతరం వాటిని జనావాసాలకు దూరంగా రిజర్వు ఫారెస్టలలో విడిచిపెట్టాలని సూచించారు. కోతుల పట్టివేతకు సంబంధించిన డాటాను ఖచ్చితంగా నమోదు చేయాలని ఆదేశించారు. కోతుల దాడికి గురై ఆస్పత్రులకు వచ్చే బాధితులకు వ్యాక్సిన్లు వేసి, మెరుగైన చికిత్సలను అందించాలని వైద్యులకు సూచించారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

ప్రణాళికల ప్రకారం ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డీఎఫ్ఓ రామ్ కిషన్, డీఎంహెచ్ఓ ధన్‌రాజ్, నిర్మల్, బైంసా, ఖానాపూర్ మున్సిపల్ కమిషనర్లు రాజు, వెంకటేశ్వర్ రావ్, మనోహర్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి కోసం బీజేపీని గెలిపించండి

- బీజేపీ ఎంపీ అభ్యర్థి గెడం నగేష్



మాట్లాడుతున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి గెడం నగేష్

నవతెలంగాణ-కాగజ్‌నగర్

అభివృద్ధి జరగాలంటే బీజేపీని గెలిపించాలని ఆదిలాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి గెడం నగేష్ అన్నారు. సోమవారం కాగజ్‌నగర్ పట్టణంలోని పటేల్ గార్డెన్స్‌లో సిర్పూరు నియోజకవర్గ స్థాయి బూత్ సమ్మేళనం నిర్వహించారు. ఈ సమావేశంలో నగేష్ మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికలలో ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలోని నాలుగు అసెంబ్లీ స్థానాలలో బీజేపీ విజయకేతనం ఎగురవేసిందని, ఇపుడు కూడా ఎంపీ ఎన్నికలలో తనను గెలిపిస్తే ఈ ప్రాంతాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తానన్నారు. గతంలో మంత్రిగా పని చేశానని, దివంగత మాజీ ఎమ్మెల్యే పాల్వాయి పురుషోత్తంరావుతో కలిసి ఎమ్మెల్యేగా పని చేసిన అనుభవం ఉందన్నారు. ఈ ప్రాంత సమస్యల పట్ల తనకు పూర్తి అవగాహన ఉందని, ఈ నియోజకవర్గ ప్రజలు తనను ఆదరిస్తే ఈ సమస్యల పరిష్కారానికి స్థానిక ఎమ్మెల్యే హరీష్‌బాబుతో కలిసి కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. గడిచిన పదేండ్ల కాలంలో ఎలాంటి మచ్చ లేని పాలనను ప్రధాని నరేంద్రమోడి అందించారని, కోవిడ్ సమయంలో దేశం క్లిష్టపరిస్థితులలో ఉన్నా దానిని సమవర్థంగా ఎదుర్కొన్న దేశం ఏదైనా ఉందంటే అది భారతదేశం మాత్రమేనని గుర్తు చేశారు. ఈ ఘనత ప్రధాని మోడీకే దక్కుతుందన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ సిర్పూరు నియోజకవర్గం నుండి ఎంపీ ఎన్నికలలో బీజేపీ అభ్యర్థికి లక్షకుపైగా ఓట్లు రావాలని, ఇందుకోసం ప్రతీ కార్యకర్త కృషి చేయాలని కోరారు. సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వస్తేనే దేశం పురోభివృద్ధి సాధిస్తుందన్నారు. బీజేపీ హయాంలో జరిగిన అభివృద్ధిని కార్యకర్తలు ఇంటింటికి ప్రచారం చేయాలని సూచించారు. ఎంపీ అభ్యర్థి గెడం నగేష్ మృదు స్వభావని, గతంలో మంత్రిగా పని చేసిన అనుభవం ఈ ప్రాంత అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ మాట్లాడుతూ వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రతీ కార్యకర్త జాగ్రత్తలు తీసుకుంటూనే ఇంటింటికి ప్రచారం నిర్వహించాలని సూచించారు. ఆదిలాబాద్‌లో బీజేపీకి మంచి ఆదరణ ఉందని, దీనితోనే బీజేపీ గెలుపు తథ్యమని అర్థమవుతోందని అన్నారు. మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ సుహాసినిరెడ్డి మాట్లాడుతూ నిరుపేదల ప్రభుత్వం మోడీ ప్రభుత్వమని అన్నారు. కార్యకర్తలు కష్టపడి పని చేసి కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకువెళితే బీజేపీ గెలుపు సాధ్యమని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో నాయకులు అల్లాపూర్ శ్రీనివాస్, అయ్యన్నగారి భూమయ్య, శరత్‌చంద్ర, కొంగ సత్యనారాయణ, గోలెం వెంకటేష్, ధోని శ్రీశైలం, వీరభద్రచారి, సిందం శ్రీనివాస్, ఈర్ల విశ్వేశ్వర్‌రావు, దెబ్బటి శ్రీనివాస్, శ్రీదేవి, మౌనిక పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

- రిమ్స్‌ను సందర్శించిన కలెక్టర్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రిమ్స్‌కు వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా అన్నారు. సోమవారం రాత్రి రిమ్స్‌ను ఆకస్మికంగా సందర్శించి వైద్య సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా రిమ్స్‌లోని పలు వార్డును పరిశీలించారు. ఓపి, ప్లాస్టర్ వేయు గది, గిరిజన వైద్య ఆరోగ్య సేవల సహాయక కేంద్రం, మెటర్నిటి వార్డ్, ఐసీయు తదితర గదులను పరిశిలించి పనితీరును అడిగి తెలుసుకున్నారు. రిజిస్టర్లను తనిఖీ చేసి షిఫ్ట్ వారిగా వైద్యుల విధులను పరిశీలించారు. పేషెంట్ కేర్, స్విపర్స్ ఎంత మంది పనిచేస్తున్నారు. ఈరోజు విధులకు ఎంతమంది హాజరయ్యారని వివరాలను అడిగి తెలుసుకున్నారు. పేషంట్లతో మాట్లాడుతూ వారి బాగోగులను అడిగి తెలుసుకొని వైద్యం అందుతున్న తీరును అడిగారు. వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటున్నారా లేదా అని ఆరా తీశారు. గిరిజన జిల్లా అయినందున ఎక్కువ గిరిజనులు, పేదలే



రిమ్స్‌కు వస్తారని, వారికి నాణ్యమైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ డాక్టర్ రాథోడ్ జైసింగ్, వైద్యాధికారులున్నారు.



బీఆర్ఎస్‌లో చేరిన బీఎస్పీ నాయకులు

నవతెలంగాణ-చింతలమానేపల్లి

మండలంలోని బీఎస్పీ నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ ఆధ్వర్యంలో మండలానికి చెందిన బీఎస్పీ ఎంపీటీసీ జాడి సుశీల, తిరుపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి మాజీ సర్పంచ్ డోకే రాజన్న, ప్రచార కమిటీ అధ్యక్షులు రామగోని నీలాగౌడ్‌తో పాటు ఆయా గ్రామాల వార్డు మెంబర్స్ బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు గెలుపుకు అహర్నిశలు కష్టపడి కృషి చేయాలన్నారు. కొత్త పాత తేడా లేకుండా భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఉమా మహేష్, రాణా ప్రతాప్ సింగ్ పాల్గొన్నారు.

స్నేహితురాలికి బాసటగా నిలిచిన పూర్వ విద్యార్థులు

- పరామర్శించి.. ఆర్థిక సాయం చేసి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

స్నేహితులంటే సినిమాలకు వెళ్లడం, షికార్లు కొట్టడమే కాదు... ఆపదలో ఉన్నవారికి బాసటగా నిలువడం, వారి కష్టసుఖాల్లో పాలుపంచుకోవడం. మేమున్నామనే ధైర్యాన్నివ్వడం. సరిగ్గా అటువంటి పనే చేశారు. నార్నూర్ మండలం తడిహత్నూర్ జడ్పీ హైస్కూల్ 2005-26 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు. తమ తోటి స్నేహితురాలు కష్టంలో ఉందని తెలుసుకుని ఆమెకు సాయం చేసి అండగా నిలిచారు. తడిహత్నూర్ గ్రామానికి చెందిన వికలాంగురాలైన అనురాధ ఒక కాలును ఇటీవల రిమ్స్‌లో శస్త్రచికిత్స చేసి మోకాలి నుంచి తొలగించారు. మరో కాలికి సైతం త్వరలో శస్త్ర చికిత్స చేయనున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఆమె తోటి స్నేహితులు, పూర్వ విద్యార్థులు సోమవారం రిమ్స్‌కు వెళ్లి పరామర్శించారు. తమవంతుగా రూ.10వేల ఆర్థిక సాయం అందజేసి ఔదార్యాన్ని చాటారు. అధైర్యపడొద్దని, అండగా ఉంటామని వారి కుటుంబానికి భరోసా కల్పించడంతో పాటు వైద్యులను కలిసి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు జాదవ్ గణేష్, చకోర్ గోవింద్, ఫాడ్ గోవింద్, అశ్విన్, జుబైర్, రహీం, ప్రశాంత్, సరిత, విద్య, అగర్వాల్ గణేష్ పాల్గొన్నారు.

విద్యుత్ తీగలు తెగిపడి మూడెడ్లు మృత్యువాత



నవతెలంగాణ-సిరికొండ

11కేవీ విద్యుత్ తీగలు తెగిపడి మూడెడ్లు మృత్యువాత పడ్డ సంఘటన మండలంలోని రిమ్మ గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. పశుపోషకులు తెలిపిన వివరాల ప్రకారం... రిమ్మ గ్రామానికి చెందిన ముగ్గురు గిరిజన రైతులు మడవి సీతారాం, పెందూర్ జంగు, పెందూర్ శంభులకు చెందిన ఒక్కో ఎద్దు పంట పొలాల్లో మేస్తుండగా విద్యుత్ తీగలు తెగిపడి ఆ ఎడ్లపైన పడటంతో అక్కడిక్కడే మృతి చెందాయి. విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యంతోనే తమ ఎడ్లు చనిపోయాయని, మధ్య మధ్యలో కరెంట్ స్తంభాలు లేకపోవడంతో కిందికి వేలాడుతూ కరెంట్ తీగలు తెగిపోయాయని రైతులు తెలిపారు. సంఘటన జరిగిన తర్వాత విద్యుత్‌శాఖ అధికారులకు సమాచారం అందించిన సకాలంలో రాలేదని అన్నారు. మృతి చెందిన ఎడ్ల విలువ రూ 1.70 లక్షల వరకు ఉంటుందని, బాధిత గిరిజన రైతు కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని ఎంపీపీ అమృత్ రావ్, మాజీ సర్పంచ్ అనిల్ కుమార్ కోరారు. విద్యుత్ అధికారులు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండాలని అన్నారు.

పీఆర్టీయూ మండల కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక



నవతెలంగాణ-నార్నూర్

పీఆర్టీయూ మండల కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలకు పీఆర్టీయూ జిల్లా వర్కింగ్ ప్రసిడెంట్ జాదవ్ ప్రకాష్ ఎన్నికల అధికారిగా ఉండి కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గంలో మండల గౌరవ అధ్యక్షురాలిగా పవార్ అనిత, మండల అధ్యక్షులుగా రాథోడ్ రాజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా కోరెంగ లక్ష్మణ్, మండల మహిళా అధ్యక్షురాలిగా హిరాతాయి, మండల కార్యదర్శిగా రాథోడ్ రాజేంద్రప్రసాద్, రాథోడ్ ప్రమోద్, చౌహాన్ ఈశ్వర్, జిల్లా మండల అసోసియేట్‌గా జాదవ్ దిగాంబర్, జాదవ్ నిర్మల, మండల మహిళా కార్యదర్శిగా అశ్విని, మండల ఉపాధ్యక్షులుగా రాథోడ్ జితేందర్, సుభాష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యవర్గం రెండు సంవత్సరాల కాలం పాటు కొనసాగుతుందని పేర్కొన్నారు.

జొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రంలోని స్థానిక మార్కెట్ యార్డులో సోమవారం జొన్న కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ సీఈఓ గోలి స్వామి ప్రారంభించారు. రైతులు పంటలు తీసుకొచ్చే సమయంలో తేమా లేకుండా పంటలను శుభ్రపరిచి ఆరపెట్టుకొని తీసుకురావాలని సూచించారు. పంటకు మద్దతు ధర రూ.3,180, ప్రభుత్వం ప్రకటించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ కార్యదర్శి ఎస్.మనోహర్, ఏఓ విశ్వమిత్ర, సీఈఓ నాగభూషణం, ఏఈఓలు సంతోష్, వాజిత్ పాల్గొన్నారు.




పాలిటెక్నిక్‌లో ప్రవేశాల కోసం దరఖాస్తులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రభుత్వ, ప్రయివేటు పాలిటెక్నిక్ కళాశాలలతో పాటుగా, వ్యవసాయ, వెటర్నరీ, హార్టికల్చర్, ఫిషరీస్ డిప్లమోలలో ప్రవేశం కోసం నిర్వహించే పాలిటెక్నిక్ ఉమ్మడి ప్రవేశ పరీక్ష పాలీసెట్ కొరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆదిలాబాద్ ప్రభుత్వ సంజయ్ గాంధీ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ భరద్వాజ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏప్రిల్ 22 వరకు దరఖాస్తుకు అవకాశం ఉందని, మే 17న పాలీసెట్ ప్రవేశ పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు.పదో తరగతి సిలబస్ ఆధారంగా రెండున్నర గంటల పాటు నిర్వహించే పాలీసెట్ ప్రశ్నాపత్రంలో గణితం, భౌతిక, రసాయన, జీవశాస్త్రాలలో మొత్తం 150 మార్కుల ప్రశ్నలు తెలుగు, ఆంగ్లంలో ఉంటాయన్నారు. ప్రవేశ పరీక్షలో వచ్చిన మార్కులు, ర్యాంకు ఆధారంగా వివిధ పాలిటెక్నిక్ కళాశాలలు, కోర్సులలో అడ్మిషన్స్ ఉంటాయని పేర్కొన్నారు. పాలీసెట్-2024కు సంబంధించిన పూర్తి వివరాలు సమాచార పుస్తకాన్ని పాలీసెట్.ఎస్‌బీనెట్.తెలంగాణ.గావ్.ఇన్ వెబ్‌సైట్‌లో పొందవచ్చు. పదోతరగతి పూర్తయిన, చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని తెలిపారు. సంజయ్ గాంధీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ మూడు సంవత్సరాల డిప్లమో కోర్సులలో 60 సీట్లు చొప్పున కలవని తెలిపారు. విద్యార్థులు గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ భరద్వాజ తెలిపారు.

పశువులపాక దగ్ధం



నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని అర్లి(కె) గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ నార కిష్టన్నకు చెందిన పశువుల పాక సోమవారం ఉదయం దగ్ధం అయినట్లు మాజీ సర్పంచ్ నార కిష్టన్న తెలిపారు. విషయం తెలుసుకున్న జెడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి, మండల సీనియర్ కాంగ్రెస్ నాయకులు కళ్యాణం రాజేశ్వర్, మాజీ జెడ్పీటీసీ బొల్లారం బాబన్న, వెంకట్ యాదవ్ గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించి, జరిగిన సంఘటనను అడిగి తెలుసుకున్నారు. వేసవి కాలం దృష్ట్యా మండల ప్రజలు కరెంటు తీగలు, అగ్ని ప్రమాదాల నుంచి కాపాడుకోవాలని కోరారు.

'మాదిగల ఓట్లు మాకే అని ప్రచారం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం'

నవతెలంగాణ-కడెం

రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కొంతమంది వాళ్ల స్వార్థం కోసం మాదిగల ఓట్లు మాకే పడతాయన్న ధీమాతో ప్రచారాలు చేస్తున్నారని దానిని మేము తీవ్రంగా ఖండిస్తున్నామని నిర్మల్ జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షులు తారి శంకర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని హరిత రిసార్ట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మాదిగలు మాదిగ ఉపకులాలు కాంగ్రెస్ వైపే ఉన్నాయని ఖచ్చితంగా ఆదిలాబాద్ పార్లమెంట్ ఎన్నికలలో మాదిగల సత్తా చూపెడతామని వారు తెలిపారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణని అత్యధిక మెజారిటీతో గెలిపిస్తామని 100శాతం మాదిగ, మాదిగ ఉపకులాల ఓట్లు కాంగ్రెస్ అభ్యర్థి సుగుణకు ఫోల్ అయ్యేవిధంగా కృషి చేస్తామని వారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు తుమ్మల మల్లేష్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పడిగెల భూషణ్, శనిగారపు కమలాకర్, పడిగెల రాజు, కడెం మాజీ సర్పంచ్ చిట్యాల చిన్నయ్య, తాళ్లపెల్లి రమేష్, దుర్గం రాజేష్ పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

నవతెలంగాణ-సిరికొండ

మండల కేంద్రంలో సోమవారం ఉపాధి హామీ పనులను ఏపీఓ భీంరావ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉపాధి హామీ పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఇచ్చిన కొలతల ప్రకారం పనులు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ స్వరూప, ఫీల్డ్ అసిస్టెంట్ ఈశ్వర్ పాల్గొన్నారు.



ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

- బీఆర్ఎస్ పార్టీలో పలువురు చేరిక

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి రోజున అత్యంత ఎత్తైన అంబేద్కర్ విగ్రహం వద్ద ముఖ్యమంత్రి నివాళి అర్పించకపోవడం సరైంది కాదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు జోగు రామన్న అన్నారు. సోమవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన పలువురు నాయకులు తిరిగి గులాబి గూటికి చేరగా, వారికి కండువాలు కప్పి ఆహ్వానం పలికారు. బేల మండలం సైద్‌పూర్ మాజీ సర్పంచ్ రోహిదాస్‌తో పాటు గోపాల్, రాంలాల్, సంతోష్ మాజీ మంత్రి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి జోగు రామన్న మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీతో అభివృద్ధి సాధ్యమని వెళ్లిన నాయకులకు నిరాశే ఎదురవుతోందని అన్నారు. ప్రజలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం చేసిందేమీ లేదన్నారు. అత్యంత ఎత్తైన అంబేద్కర్ విగ్రహాన్ని గత ప్రభుత్వ హయంలో నిర్మిస్తే, ఆ మహనీయుని జయంతి రోజున ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విగ్రహం వద్ద నివాళి అర్పించక పోవడాన్ని తీవ్రంగా ఖండించారు. గతంలోనూ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను పలు మార్లు అవమానించిన విషయాన్నీ గుర్తు చేశారు. కార్యక్రమంలో మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మెన్ రౌత్ మనోహర్, గంభీర్ ఠాక్రే, ప్రమోద్‌రెడ్డి, సతీష్ పవార్, విపిన్, దేవన్న, తన్వీర్, దత్తు మధుకర్, ప్రతాప్ పాల్గొన్నారు.

రైతు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేస్తాం



నవతెలంగాణ-కుభీర్

రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని మార్కెట్ కమిటీ కార్యదర్శి గంగన్న అన్నారు. సోమవారం స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో జొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో ఉన్న ఆయా గ్రామాల రైతులు రబీసీజన్‌లో పండించిన జొన్నలను మార్కెఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోళ్లు చేసి వారికి మద్దతు ధర కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. క్వింటాల్ జొన్నలను రూ.3,180 మద్దతు ధరను ప్రకటించి, రైతులకు ఇబ్బందులు రాకుండా చూస్తామని అన్నారు. అదే విధంగా మంగళవారం నుంచి గ్రామంలో ఉన్న రైతులకు వ్యవసాయ విస్తీరణ అధికారుల వద్ద నుంచి టోకెన్స్ ఇచ్చి జొన్నల కొనుగోళ్లు చేస్తామని అన్నారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ఉండాలని తెలిపారు. అదే విధంగా రైతులు దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహకార సంఘం కార్యదర్శి క్రాంతికుమార్, రైతులు, వ్యవసాయ సిబ్బంది ఉన్నారు.

ఘనంగా హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు

నవతెలంగాణ-ఉట్నూర్

నూతనంగా నిర్మించిన హనుమాన్ ఆలయంలో సోమవారం విగ్రహ ప్రతిష్టాపన వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండలంలోని కొమ్ముగూడ గ్రామంలో గ్రామస్తులు విగ్రహాలకు సంప్రదాయ బద్ధంగా పూజలు నిర్వహించి, ప్రతిష్ఠించారు. అనంతరం భక్తులకు ప్రసాదాన్ని వితరించారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్ద రవి నాయక్, నరేష్, కాంగ్రెస్ నాయకులు జాదవ్ రాజేష్, టీటీఎఫ్ రాష్ట్ర నాయకులు జాదవ్ చంద్రకాంత్, మహేందర్, మురళి, రవీందర్, గ్రామ ప్రజలు మహిళలు పాల్గొని, పూజలు నిర్వహించారు.

యువత మత్తు పదార్థాల బారిన పడకుండా ఉండాలి

- మత్తు పదార్థాల నిర్మూలనకు తోడ్పడేలా పోస్టర్ల ఆవిష్కరణ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



యువత మత్తు పదార్థాల బారిన పడకుండా ఉండాలని జిల్లా ఎస్పీ గౌస్ ఆలం అన్నారు. జిల్లా వ్యాప్తంగా అవగాహన సదస్సులను ఏర్పాటు చేసి యువతను చైతన్య పరుస్తూ, మత్తు పదార్థాలను భారిన పడితే జరిగి అనర్థాలపై వివరిస్తూ షీటీం ద్వారా కార్యక్రమాలను చేపడుతున్నట్టు తెలియజేశారు. సోమవారం స్థానిక పోలీసు ముఖ్య కార్యాలయంలో జిల్లా ఎస్పీ, అధికారుల సమక్షంలో మత్తు పదార్థాలు, కల్తీ కల్లు, గంజాయి, నిర్మూలనకు తోడ్పడేలా ఏర్పాటు చేసిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఒక పోలీస్ స్టేషన్, విద్యాసంస్థలలో టీఎస్ న్యాబ్ ద్వారా విచ్చేసిన పోస్టర్లను ఉంచడం జరుగుతుందని తెలిపారు. ఇటువంటి సమాచారాన్ని అందించాలన్న పోస్టర్లలో పేర్కొన్న నంబర్లకు ఫోన్ చేసి చెప్పగలరని సూచించారు. కల్తీ కల్లు, గంజాయి లాంటి వాటిని తాగడం వల్ల ప్రాణ హాని తప్పదని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఆపరేషన్ బి సురేందర్‌రావు, ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి, డీసీఆర్బి డీఎస్పీ సురేందర్, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ పోతారం శ్రీనివాస్, సీఐలు కే సత్యనారాయణ, ఏ.అశోక్, డి.సాయినాథ్, కె.ఫణిధర్, శ్రీనివాస్, డీసీఆర్బి సీఐ, సిబ్బంది పాల్గొన్నారు.

దేగామలో కబడ్డీ పోటీలు ప్రారంభం



నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని దేగామ గ్రామంలో సోమవారం రాజ్‌గొండ్ యూత్ ఆధ్వర్యంలో గ్రామస్థాయి కబడ్డీ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయుడు త్రియంబక్‌రావు మాట్లాడుతూ గ్రామస్థాయి ఆట పోటీలు నిర్వహించినట్లయితే గ్రామ క్రీడాకారులను వెలుగులోకి తీసుకు రావాలని కోరారు. అనంతరం దుర్వ భీమ్‌రావు మాట్లాడుతూ ఆసక్తిగల కబడ్డీ ఆటగాళ్లందరూ దీన్ని సద్వినియోగం పరుచుకోవాలని కోరారు. ఈ కబడ్డీ పోటీలో గెలుపొందిన జట్టుకు మొదటి బహుమతి రూ.30 వేలు, ఉపాధ్యాయులు త్రియంబక్‌రావు, సంజీవరెడ్డిలు, రెండో బహుమతి రూ.20 వేలు జెడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి, మూడో బహుమతి రూ.10వేలు మెస్రం హనుమంతు, నాలుగో బహుమతి రూ.7 వేలు మేనేజ్మెంట్ అందిస్తుందని తెలిపారు. నియమ నిబంధనలు ఒక జట్టులో ఆడిన వారు వేరే జట్టులో ఆడరాదు. ఆటలో ఏదైనా ప్రమాదం జరిగిన మేనేజ్మెంట్ బాధ్యత వహించదు. ఎంపైర్ నిర్ణయమే దూది నిర్ణయం. మద్యం సేవించి ఆట ఆడిన టీంను క్రాస్ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సంజీవరెడ్డి, గ్రామ పెద్దలు పటేల్ ఆడ నాగోరావు, పెందూరు కృష్ణ మహాజన్, ఆత్రం గణపతిరావు దేవరీ, ధ్రువ సూర్యబాన్ గాట్యాల్, నైతం మారుతి, యూత్ అధ్యక్షులు సభ్యులు భీంరావు, అనిల్, రవి, సంజీవ్ పాల్గొన్నారు.